# 2021, మార్చి 18వ తేదీన తెలంగాణ రాష్ట్ర శాసనసభకు 2021-22 ఆర్థిక సంవత్సరం బడ్జెట్ ని సమర్పిస్తూ గౌరవనీయులైన ఆర్థిక మంత్రి శ్రీ తన్నీరు హరీష్ రావు గారి ప్రసంగం

గౌరవ అధ్యక్షా !

భారత రాజ్యాంగం పేర్కొన్న సమానత్వ విలువ కోసం, వివక్ష లేని పరిపాలన కోసం తెలంగాణ ప్రజలు ప్రత్యేక రాష్ట్రాన్ని కోరుకున్నారు. అర్ధ శతాబ్దం పాటు అవిశ్రాంతంగా నడిచిన ప్రజాపోరాటం మలిదశలో నేటి ముఖ్యమంత్రి నాటి ఉద్యమ సారథి శ్రీ కేసీఆర్ గారి నాయకత్వం లో తెలంగాణా స్వరాష్ట్ర స్వప్నం సాకారమైంది. నూతన రాష్ట్రాన్ని ప్రగతి పథం లో నడిపించే చారిత్రక ప్రస్థానం లో నేడు ఈ ఆర్థిక సంవత్సరం వార్షిక బడ్జెట్ ను ప్రవేశపెట్టే గురుతర బాధ్యతను నాకు అప్పగించినందుకు గౌరవ ముఖ్యమంత్రి శ్రీ కేసీఆర్ గారికి హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.

2. తెలంగాణ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల ఆకాంక్షలను నెరవేరుస్తూ ఇంటా, బయటా మన్ననలు పొందుతోంది. ఏడేళ్ల వయసున్న తెలంగాణ రాష్ట్రం, ఏడు పదుల వయసున్న రాష్ట్రాలతో

పోటీపడుతూ, అభివృద్ధిలో అగ్రభాగాన నిలిచింది. ఇది రాష్ట్ర ప్రజలందరికీ గర్వకారణం.

3. 'ఏదీ సులభమ్ముగా సాధ్యపడదు లెమ్ము' అని మహాకవి దాశరథి అన్నట్లుగా ఈ అద్భుతమైన అభివృద్ధి కూడా అంత సులభంగా సాధ్యం కాలేదు. రాష్ట్రం ఏర్పడిన నాడు పరిస్థితి అంతా అస్పష్టంగా, గందరగోళంగా ఉంది. అన్నిరంగాలలో వెనుకబాటుతనం అలుముకొని ఉంది, తెలంగాణా ప్రభుత్వం అస్పష్టతలను ఛేధిస్తూ, ఆదాయ, వ్యయాలను ఆకళింపు చేసుకుంటూ, నూతన రాష్ట్రానికి తగిన విధానాలను అవలంబిస్తూ అభివృద్ధి వైపు వడివడిగా అడుగులు వేసింది. తెలంగాణ ప్రయోజనాలకు అనుగుణమైన పంథాలో ఆర్థిక ప్రణాళికలను రూపొందించింది. నిర్దేశించుకున్న లక్ష్యాలను, ఆశించిన సమయంలోనే సాధించింది. దీని వెనుక గౌరవ ముఖ్యమంత్రి కేసీఆర్ గారి నిరంతర మేధోమధనం ఉంది. రేపటి అవసరాలకు తగినట్లు నేడే ఆలోచించగలిగిన దార్శనికత ఉంది. రాబోయే సమస్యలను పసిగట్టి పరిష్కార మార్గాలను ముందే సిద్ధం చేసిన దూరదృష్టి ఉంది.

4. ఉద్యమ దశ, రాష్ట్ర ఆవిర్భావం, స్వరాష్ట్రం లో సాధించిన ఎనలేని ప్రగతి ఇదంతా మన కళ్లముందే ఆవిష్కృతమైన ఒక అద్భుత చరిత్ర.

రాష్ట్రం ఏర్పడిన నాటి నుండి ఇప్పటి వరకు ప్రభుత్వానికి ఎన్నో సమస్యలు, సవాళ్లు, ప్రతికూల పరిస్థితులు ఎదురైనాయి. వాటన్నింటిని చాకచక్యంగా అధిగమిస్తూ తెలంగాణ ప్రభుత్వం ముందుకు నడిచింది. అభివృద్ధిలో కొత్తపుంతలు తొక్కింది. సంక్షేమంలో కొత్త ప్రమాణాలను నెలకొల్పింది. ఈ విషయంలో మాకు ప్రజల నుంచి గొప్ప సహకారం, అండదండలు లభించాయి. వారి చల్లని దీవెనలతోనే నేడు తెలంగాణ అభ్యుదయ పథంలో దూసుకుపోతున్నది.

రాష్ట్ర ఆర్థిక పరిస్థితి పై కరోనా ప్రభావం:

5. తెలంగాణ అభివృద్ధి సాఫీగా కొనసాగుతున్న తరుణంలో కరోనా రూపంలో ఊహించని విపత్తు విరుచుకుపడింది. గత శతాబ్ద కాలంలో ఎన్నడూ ఎరుగనంత సంక్షోభాన్ని కరోనా కారణంగా యావత్ ప్రపంచం ఎదుర్కొన్నది. గొప్ప గొప్ప దేశాల ఆర్థిక వ్యవస్థలు కుప్పకూలినయి. ఆకాశంలో ఎగిరే విమానం మొదలుకొని రోడ్డు మీద పరిగెత్తే ఆటోరిక్షా వరకు అన్ని ఆగిపోయాయి. ప్రపంచం ఎక్కడికక్కడే స్తంభించిపోయింది. ఎవరూ గడపదాటి కాలు బయటపెట్టకూడని గడ్డు పరిస్థితి దాపురించింది. ఈ పర్యవసానాలన్నింటికి తెలంగాణ కూడా లోనయింది. పరిస్థితి లోని తీవ్రతను గమనించి కేంద్ర ప్రభుత్వం గత

సంవత్సరం మార్చి 23వ తేదీ నుంచి మే 5వ తేదీ వరకు దేశమంతటా లాక్‌డౌన్ ప్రకటించింది.

6. లాక్‌డౌన్ కేంద్ర, రాష్ట్రాల ఆర్థిక వ్యవస్థల మీద తీవ్రమైన ప్రభావం చూపింది. చరిత్రలో ఎన్నడూలేని విధంగా దేశ జీడీపీ అతిదారుణంగా పతనమయ్యింది.

7. దేశ జీడీపీ తగ్గుదల ఎన్నడూ లేనివిధంగా స్థిరధరలల్లో (కాన్‌స్టెంట్ ప్రైసెస్) మొదటి త్రైమాసికంలో -24.4 శాతం, రెండవ త్రైమాసికంలో -7.3 శాతం, 3వ త్రైమాసికంలో +0.4 శాతంగా నమోదయ్యింది. మొత్తంగా సంవత్సరానికి -8.0 శాతంగా నమోదయ్యింది. అదే విధంగా ప్రస్తుత ధరల్లో (కరెంట్ ప్రైసెస్)లో దేశ జీడీపీ వృద్ధి -3.8 శాతం ఉండగా, అది తెలంగాణలో +1.3 శాతంగా నమోదయ్యింది. ఇటువంటి ప్రతికూల పరిస్థితులలో మన ముఖ్యమంత్రి కేసీఆర్ గారు ప్రజల ఆరోగ్యం కాపాడే చర్యలు ఒకపక్క తీసుకుంటూనే.. మరోపక్క రాష్ట్రం ఆర్థికంగా దెబ్బతినకుండా ముందు జాగ్రత చర్యలు చేపట్టారు. దీంతో తెలంగాణ ఆరోగ్య రంగంలోను.. ఆర్థిక రంగంలోనూ కరోనా కాలం విసిరిన సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొన్నది.

8. కరోనాకు వ్యాక్సిన్ అందుబాటులోకి రావడంతో సమాజం మెల్లమెల్లగా తేరుకుంటున్నది. ఆర్థిక వ్యవస్థ క్రమేపీ కోలుకుంటున్నది. ఈ నేపథ్యంలో వచ్చే ఆర్థిక సంవత్సరం రాష్ట్ర జీఎస్డీపీలో మంచి వృద్ధి ఉంటుందని ఆశిస్తున్నాం. అందుకు అనుగుణంగానే ఈ బడ్జెట్ ను రూపొందించాం.

## రాష్ట్ర ఆర్థిక పరిస్థితి:

9. ముందస్తు అంచనాల ప్రకారం, 2020-21లో స్థూల రాష్ట్ర దేశీయ ఉత్పత్తి (జి.ఎస్.డి.పి) ప్రస్తుత ధరల ప్రకారం 9,78,373 కోట్ల రూపాయలుగా ఉంటుందని అంచనా. కరోనా విస్తృతితో పాటు లాక్‌డౌన్ కారణంగా, 2019-20లో జీ.ఎస్.డీ.పీ వృద్ధి 13.5% నుండి 1.3% కి గణనీయంగా తగ్గింది. అయితే జాతీయ జీడీపీ వృద్ధి రేటు 7.8% నుండి -3.8% తగ్గింది. జాతీయస్థాయి జీడీపీ వృద్ధి రేటుతో పోలిస్తే రాష్ట్ర జీ.ఎస్.డీ.పీ వృద్ధి రేటు మెరుగ్గా ఉంది. ముఖ్యమంత్రి కేసీఆర్ గారు ఎంతో దూరదృష్టితో తెలంగాణా గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు పరిపుష్టిని కలిగిస్తూ వచ్చారు. అందువల్ల కరోనా సంక్షోభం చుట్టుముట్టినా మన గ్రామీణ ఆర్థిక వ్యవస్థ తట్టుకొని నిలబడ్డది. విద్యుత్ సరఫరాలో వచ్చిన మెరుగుదల, ప్రాజెక్టులతో కొత్తగా వచ్చిన సాగునీటి సదుపాయం, రైతుబంధు, గొర్రెల పంపిణీ, మత్స్యకారులకు

చేప విత్తనాల సరఫరా వంటి అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలుచేయడం వల్ల 2020-21 సంవత్సరంలో ప్రాథమిక రంగం అంచనాలో 17.7 శాతం వృద్ధి రేటును నమోదు చేసింది. సెకండరీ మరియు సేవా రంగం వృద్ధి వరుసగా -5.2 శాతం మరియు -1.9 శాతం క్షీణించింది.

**తలసరి ఆదాయం:**

10. తెలంగాణ రాష్ట్ర తలసరి ఆదాయం 2020-21 సంవత్సరానికి రూ.2,27,145/- ఉంటుందని కేంద్ర గణాంక శాఖ అంచనా. ఇది గత సంవత్సరం కంటే +0.6 శాతం ఎక్కువ. భారత దేశ తలసరి ఆదాయం 2020-21 సంవత్సరానికి రూ.1,27,768/- ఉంటుందని అంచనా. ఇది గత సంవత్సరాని కంటే -4.8 శాతం తగ్గింది. అంటే తెలంగాణ తలసరి ఆదాయం దేశ తలసరి ఆదాయం కంటే రూ.99,377/- అధికంగా ఉంది. అంతేకాక దేశ ఆదాయం తగ్గిన పరిస్థితుల్లో కూడా తెలంగాణ ఆదాయం పెరిగింది. దీన్నిబట్టి ప్రతికూల పరిస్థితుల్లోను మన రాష్ట్ర పురోగతి ఎంతో మెరుగ్గా ఉందని అర్థం చేసుకోవచ్చు. నేడు దేశంలో తెలంగాణ ఒక ప్రబల ఆర్థికశక్తిగా ఎదుగుతోంది అని అనడానికి ఇది సరైన నిదర్శనం.

గ్రామీణాభివృద్ధి- పల్లె ప్రగతి:

11. గత పాలకుల క్షమించరాని నిర్లక్ష్యం వల్ల పల్లెలు మురికి కూపాల్లా తయారయ్యాయి. స్థానిక సంస్థలు నిర్వీర్యం కావడంతో పట్టించుకునే నాథుడే లేకుండా పోయాడు. పల్లెల్లో ఎటు చూసినా పేరుకుపోయిన చెత్తాచెదారం, కూలిపోయిన ఇండ్ల శిథిలాలు, దారిపొడవునా పిచ్చిమొక్కలు, పాడుబడిన బావులు, బొందలు, పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు కనిపించే దుస్థితి దాపురించింది. ఈ పరిస్థితిని సమూలంగా మార్చేసి గ్రామాలలో పారిశుద్ధ్యాన్ని, పచ్చదనాన్ని పెంచాలని, గ్రామానికి అవసరమైన అన్నిరకాల మౌలిక వసతులను కల్పించాలని ముఖ్యమంత్రి కేసీఆర్ గారు నిర్ణయించారు. ఈ లక్ష్యాన్ని సాధించడానికి పల్లెప్రగతి పేరుతో కార్యాచరణను ప్రకటించారు.

12. ప్రజల భాగస్వామ్యంతో పల్లె ప్రగతి తెలంగాణ గ్రామీణ ముఖచిత్రాన్ని సుందరంగా మార్చేసింది. చెత్త సేకరణ మీద ప్రత్యేకమైన ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించింది. ప్రతీ గ్రామానికి చెత్త తరలింపునకు ఒక ట్రాక్టర్‌ను, డంపింగ్ యార్డును ఏర్పాటు చేసింది. చెత్త తొలగింపుపై వచ్చిన కొత్త అవగాహనతో ఇప్పుడు పల్లెలు పరిశుభ్రంగా మారిపోయాయి. పచ్చదనం పెంచేందుకు నూతన

పంచాయతీ రాజ్ చట్టంలో గ్రామ సర్పంచ్‌లకు ప్రత్యేక విధులను బాధ్యతలను పేర్కొన్నది. ప్రతి గ్రామంలో మొక్కలు విరివిగా నాటి, వాటి సంరక్షణ కోసం ప్రతీ గ్రామానికి వాటర్ ట్యాంకర్లను సమకూర్చింది.

13. స్థానిక సంస్థల బడ్జెట్ కేటాయింపుల్లో 10 శాతం గ్రీన్ బడ్జెట్‌కు కేటాయించేలా చట్టంలో నిబంధన చేసింది. దీనికి సంబంధించి అధికార వికేంద్రీకరణ చేస్తూ కలెక్టర్లకు పూర్తి బాధ్యతలు  అప్పగించింది.

14. సంపూర్ణంగా మరుగుదొడ్ల నిర్మాణం చేసి బహిరంగ మలవిసర్జన రహిత గ్రామాలుగా తీర్చిదిద్దింది. తెలంగాణ ప్రభుత్వాన్ని అభినందిస్తూ కేంద్రం స్వచ్ఛ సర్వేక్షణ అవార్డును ప్రకటించింది.

15. తెలంగాణ ఏర్పాటుకు ముందు కేవలం 84 గ్రామ పంచాయతీలకు మాత్రమే ట్రాక్టర్లు ఉండేవి. ఈ సంవత్సరం 12,668 ట్రాక్టర్లను అందించాం. దేశంలో మరే రాష్ట్రంలోను ప్రభుత్వం ప్రతీ గ్రామానికి  ట్రాక్టరు ఇచ్చిన దాఖలా లేదు. ఇవాళ తెలంగాణలో ట్రాక్టర్ లేని గ్రామమే లేదు. పంచాయతీల  అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం నెలనెల ఠంచన్‌గా నిధులను విడుదల చేస్తున్నది. పల్లె ప్రగతి కింద ఇప్పటి వరకు 5,761 కోట్ల రూపాయలు గ్రామపంచాయతీలకు విడుదల చేయడం జరిగింది. తెలంగాణ తరహాలో వేరే ఏ రాష్ట్రం

గ్రామాలకు ఈ విధంగా నిధులను విడుదల చేయడం లేదు. ప్రతీ గ్రామానికి ట్రాక్టర్, ట్రాలీ, ట్యాంకర్, నర్సరీ, పల్లె ప్రకృతి వనం, వైకుంఠధామం, డంప్ యార్డు వంటి మౌలిక సౌకర్యాలు తెలంగాణ గ్రామాల్లో ఉన్నట్టుగా దేశంలో మరెక్కడా లేవని ఘంటాపథంగా చెప్పగలను.

16. 15వ ఆర్థిక సంఘం స్థానిక సంస్థలకు విడుదల చేసే నిధుల్లో రాష్ట్రానికి 699 కోట్ల రూపాయల కోత విధించింది.

17. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం గ్రామాలకు ఏలాంటి కోత లేకుండా, సమానమైన డబ్బులను కలిపి గ్రామాలకు అందించాలని నిర్ణయించింది. గౌరవ ముఖ్యమంత్రి కేసీఆర్ గారు గ్రామాల అభివృద్ధి ఆగిపోవద్దని, తొలిసారిగా రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్ నుంచి మండల పరిషత్తులకు, జిల్లా పరిషత్తులకు 500 కోట్ల నిధులు ఇవ్వాలని నిర్ణయించారు. ఇందులో జిల్లా పరిషత్తులకు 252 కోట్ల రూపాయలను, మండల పరిషత్‌లకు 248 కోట్ల రూపాయలను ప్రతి సంవత్సరం అందించడం జరుగుతుంది. దీనికి సంబంధించిన విధివిధానాలను ప్రభుత్వం త్వరలోనే ఖరారు చేస్తుంది.

18. ఈ ఆర్థిక సంవత్సరంలో పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు 29,271 కోట్ల రూపాయలను ప్రభుత్వం ప్రతిపాదిస్తోంది.

**అసెంబ్లీ నియోజక వర్గాల అభివృద్ధికి నిధులు:**

19. దేశంలో ఎక్కడ శాసనసభ్యులకు నియోజకవర్గ కేంద్రాల్లో కార్యాలయాలు లేవు. ఇన్నేండ్లుగా ప్రభుత్వాలకు ఎమ్మెల్యేలకు కార్యాలయాలు అవసరమనే ఆలోచన కూడా రాకపోవడం శోచనీయం. ఎమ్మెల్యేలు తమ ఇండ్లలోనే కార్యకలాపాలను నిర్వహించాల్సి వస్తోంది. ఎమ్మెల్యేల స్థాయికి తగ్గట్టుగా అన్ని రకాల హంగులతో ప్రభుత్వం ఎమ్మెల్యేల కోసం నివాస కార్యాలయాలను నిర్మించింది.

20. శాసన సభ్యుల కోసం నియోజకవర్గాల్లో కార్యాలయాలను ఏర్పాటు చేసిన ఘనత ఒక్క తెలంగాణ ప్రభుత్వానికే దక్కింది. 89 నియోజకవర్గాల్లో శాసనసభ్యుల కార్యాలయాల నిర్మాణం పూర్తయింది. ఈ కార్యాలయాలు ప్రజానిలయాలుగా మారాయి. శాసనసభ్యుల గౌరవానికి, ప్రతిష్టకు ఇవి ప్రతీకలుగా నిలిచాయి.

21. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు ఇచ్చే నియోజకవర్గ అభివృద్ధి నిధుల కోసం ఐదు కోట్ల రూపాయలు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నిధుల వినియోగానికి సంబంధించిన మార్గదర్శకాలను ప్రభుత్వం త్వరలో విడుదల చేస్తుంది.

22. ఎమ్మెల్యే మరియు ఎమ్మెల్సీలకు నియోజకవర్గ అభివృద్ధి నిధుల కోసం ఈ బడ్జెట్ లో 800 కోట్ల రూపాయలను ప్రభుత్వం ప్రతిపాదిస్తోంది.

**సీఎం దళిత్ ఎంపవర్ మెంట్ ప్రోగ్రాం:**

23. భారత రాజ్యాంగ నిర్మాత డా. బీ.ఆర్ అంబేద్కర్ అన్నట్లు .. ధ్యేయం పట్ల నిలువెల్లా అంకిత భావం కలిగిన వ్యక్తులు సమాజాన్ని ముందుకు నడిపిస్తారు. ఈ మాటను నిజం చేస్తూ ముఖ్యమంత్రి గారు షెడ్యూల్ కులాల ప్రజల సర్వతోముఖాభివృద్ధి కోసం నూతన పథకాన్ని రూపొందించారు. తెలంగాణ ప్రభుత్వం ఈ బడ్జెట్ లో వేయి కోట్ల నిధులతో సీఎం దళిత్ ఎంపవర్ మెంట్ ప్రోగ్రాం ప్రవేశపెడుతోంది. ఈ నూతన పథకం ద్వారా రాష్ట్రంలోని షెడ్యూల్ కులాల ప్రజలకు పెద్ద ఎత్తున ప్రయోజనాలు కలిగించబోతున్నది.

**వ్యవసాయం - అనుబంధ రంగాలలో అభివృద్ధి:**

24. గడచిన కొన్ని సంవత్సరాలుగా బ్రహ్మాండమైన ఉపాధి అవకాశాలు కల్పించినటువంటి వాణిజ్య సేవల రంగం, సమాచార రంగం, సాంకేతిక రంగం, స్థిరాస్తి నిర్మాణ రంగాలు కరోనా కారణంగా ఒక్కసారిగా కుప్పకూలిపోయాయి. కరోనా ప్రభావాన్ని తట్టుకొని

నిలబడిన ఒకే ఒక్క రంగం వ్యవసాయం. కరోనా కష్ట కాలంలోనూ తెలంగాణలో వ్యవసాయ రంగ అభివృద్ధి క్రియాశీలకంగా ఉందని ఘంటాపథంగా చెప్పొచ్చు. గత ప్రభుత్వాలు దండుగ అని ఈసడించిన వ్యవసాయమే నేడు కరోనాను తట్టుకుని అభివృద్ధిని సాధించింది. రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి తెలంగాణ ప్రభుత్వం వ్యవసాయం, దాని అనుబంధ రంగాల్లో తీసుకున్న ఉద్దీపన చర్యల వల్లనే ఇది సాధ్యమైందని గమనించాలి. వ్యవసాయ రంగంలో ప్రభుత్వం తీసుకున్న ప్రగతిశీల చర్యలేవీ ఊరికేపోలేదు. పెట్టిన ప్రతీ పైసా సార్థకమయ్యింది అని అనడానికి ఈ ఆపత్కాలంలోను వ్యవసాయ రంగం నమోదు చేసిన అభివృద్ధి గణాంకాలే నిదర్శనం.

25. తెలంగాణలో నేడు సాగు విస్తీర్ణం రికార్డు స్థాయిలో పెరిగింది. 2014-15 లో ఉన్న సాగు విస్తీర్ణం కోటి 41 లక్షల ఎకరాలు కాగా, 2020-21 సంవత్సరంలో అది 2 కోట్ల 10 లక్షల ఎకరాలకు పెరిగింది. అంటే 49 శాతానికి పైగా వృద్ధి నమోదయింది. అదేవిధంగా పంటల ఉత్పత్తి 2014-15 సంవత్సరంలో 2 కోట్ల 5 లక్షల మెట్రిక్ టన్నులు నమోదు కాగా, అది 2020-21లో రికార్డు స్థాయిలో 4 కోట్ల 11 లక్షల మెట్రిక్ టన్నులకు పైబడి వస్తుందని అంచనా వేస్తోంది. అంటే గతంతో పోలిస్తే పంటల ఉత్పత్తి రెట్టింపవుతోంది. తెలంగాణలోని రైతులు

గడిచిన ఏడాది కాలంలో లక్ష కోట్ల రూపాయల విలువైన పంటను పండించారు. ఇది మన కళ్లముందు కనపడుతున్న వాస్తవం.

26. 60 లక్షల 54 వేల ఎకరాల్లో పత్తి సాగు చేయడం ద్వారా తెలంగాణ, దేశంలోనే పత్తిని అత్యధికంగా పండిస్తున్న రెండో రాష్ట్రంగా అవతరించింది. 2019-20 సంవత్సరంలో తెలంగాణాలో 193 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం పండింది. అందులో 111 లక్షల మెట్రిక్ టన్నులను ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్.సీ.ఐ) తెలంగాణ నుంచే సేకరించింది. వరి ధాన్యం సేకరణలో తెలంగాణ దేశంలోనే రెండవ రాష్ట్రంగా నిలిచిందని స్వయంగా ఎఫ్.సీ.ఐ. ప్రకటించడం మనకు గర్వకారణం. 2020 సంవత్సరం యాసంగిలో మన రాష్ట్రం ఎఫ్.సి.ఐ.కి 64 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం అందించింది. ఇది ఎఫ్.సీ.ఐ దేశవ్యాప్తంగా సేకరించిన మొత్తం ధాన్యంలో 56 శాతం కావడం గమనార్హం. ఈ యాసంగి సాగులో తెలంగాణ 52 లక్షల ఎకరాల సాగు విస్తీర్ణంతో దేశంలోనే మొదటి స్థానంలో నిలిచింది. 25 లక్షల ఎకరాలతో తమిళనాడు రెండో స్థానంలో ఉంది, 20 లక్షల 90 వేల ఎకరాలతో ఆంధ్రప్రదేశ్ మూడో స్థానంలో ఉంది. ఒకనాడు తెలంగాణాకు వ్యవసాయం రాదని ఈసడించుకున్న వాళ్ళే నేడు

తెలంగాణ వ్యవసాయాన్ని చూసి ఈర్షపడే విధంగా, వ్యవసాయరంగం లో మనం అపూర్వమైన ప్రగతిని సాధించగలిగాం .

27. గౌరవ ముఖ్యమంత్రి కేసీఆర్ గారు స్వయంగా ఒక రైతు. రైతుల కష్టనష్టాలు-సాధక బాధకాలు అన్నీ ఆయనకు అనుభవమే. తెలంగాణ వ్యవసాయ పరిస్థితులపైన ఆయన ఎంతో అధ్యయనం చేశారు. తెలంగాణ రైతు ఎదుర్కొంటున్న సమస్యలకు మూలాలేమిటో ఆయన అవగాహన చేసుకున్నారు. ఈ నేపథ్యం నుంచే రైతుబంధు, రైతుబీమా తరహా పథకాలు ప్రవేశపెట్టి రైతుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచగలిగారు. కేసీఆర్ గారు ప్రవేశపెట్టిన వ్యవసాయ పథకాలకు ఐక్యరాజ్యసమితి నుంచి ప్రశంసలు రావడం మనకు గర్వకారణం. మన రాష్ట్రంలో అమలవుతున్న పథకాలు దేశానికి మార్గదర్శకంగా నిలిచాయి. జాతీయ స్థాయిలో అనేక మంది ప్రముఖులు, వ్యవసాయరంగ నిపుణులు ప్రశంసిస్తున్నారు.

28. దుక్కి ఉంటేనే దిక్కు ఉంటుంది. నాగలి సాగితేనే ఆకలి తీరుతుంది. ఇది ముమ్మాటికీ నిజం. నేడు తెలంగాణ రాష్ట్రం వ్యవసాయ సమృద్ధితో కళకళలాడుతోంది. రైతుల ముఖాల్లో ఆత్మ విశ్వాసం తొణికిసలాడుతోంది. బతుకు నిలబడుతుందనే భరోసా కలిగింది. ఇది శుభపరిణామం.

29. సమైక్య రాష్ట్రంలో ప్రభుత్వాలు రైతుల కన్నీరు తుడవకపోగా, కరెంటు అడిగితే కాల్చి చంపాయి. రైతులు హిస్టీరియాతో ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, ఎక్స్ గ్రేషియా కోసం చనిపోతున్నారంటూ అవహేళన చేసాయి. స్వరాష్ట్రం ఏర్పడిన తర్వాత కేసీఆర్ గారు పట్టుదల వహించి వ్యవసాయ రంగానికి పునర్జీవం కల్పించారు. వ్యవసాయానికి 24 గంటలపాటు ఉచిత విద్యుత్తు అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం సంవత్సరానికి 10,500 కోట్ల రూపాయాలు ఖర్చు చేస్తోంది. ప్రభుత్వం రైతు సంక్షేమం కోసం అనుసరిస్తున్న రాజీలేని వైఖరికి, ఇంతకుమించిన తార్కాణం ఇంకేముంటుంది? ఎరువులు, విత్తనాలను సకాలంలో అందిస్తోంది. చెరువులను బాగు చేసి భూగర్భ జలాలు పెరిగేలా చేసింది. సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం సాగిస్తోంది. రికార్డు సమయంలో కాళేశ్వరం భారీ ఎత్తిపోతల ప్రాజెక్టును చాలా వరకు పూర్తిచేసి అందించ గలిగిన మేరకు గోదావరి నీళ్లతో బీడు భూములను సస్యశ్యామలం చేస్తోంది.

ఆయిల్‌పామ్ సాగుకు ప్రోత్సహం:

30. భారతదేశం సంవత్సరానికి 70,000 కోట్ల రూపాయల విలువ గల పామాయి ను దిగుమతి చేసుకుంటోంది. దీనికి బదులు దేశీయంగా ఉత్పత్తి చేస్తే బోలెడు విదేశీమారక ద్రవ్యం ఆదా

అవుతుంది. పామాయిల్‌కు అంతర్జాతీయ డిమాండ్ ఉండటమే కాకుండా, ఈ పంటసాగు వల్ల పర్యావరణానికి మేలు కలుగుతుంది. ఈ నేపథ్యంలో తెలంగాణ రైతుకు ఆయిల్‌పామ్ సాగు చేసేందుకు కావాల్సిన అన్నిరకాల సహకారాన్ని అందించేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది. ఆయిల్‌పామ్ సాగువల్ల తెలంగాణ రైతులు మంచి లాభాలు పొందగలుగుతారు. ఆయిల్‌పామ్ వేసిన తర్వాత నాలుగేళ్ల నుంచి పంట దిగుబడి ప్రారంభమవుతుంది. ఒక్కసారి వేస్తే 30 సంవత్సరాల దాకా పంట దిగుబడి వస్తూనే ఉంటుంది. దీని ద్వారా రైతుకు నిరంతర ఆదాయం వస్తుంది. ప్రభుత్వం ఆయిల్‌పామ్ రైతులను ప్రోత్సహించేందుకు ఎకరానికి 30 వేల రూపాయలు సబ్సిడీగా ఇవ్వాలని నిర్ణయించింది. ఇది పోగా మిగిలిన పెట్టుబడి భారం కూడా రైతుపై పడకుండా బ్యాంకుల ద్వారా ఇప్పించేందుకు కార్యాచరణను రూపొందించింది. రైతులు బ్యాంకుల వద్ద నుంచి తీసుకునే రుణాన్ని వెంటనే చెల్లించాల్సిన అవసరం లేకుండా నాలుగేళ్లపాటు మారిటోరియం విధించే విధంగా బ్యాంకులను ఒప్పించింది. రాష్ట్రంలో 8.14 లక్షల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగుకు కావాల్సిన ప్రణాళికలను ప్రభుత్వం సిద్ధం చేసింది.

## రైతు వేదికలు:

31. రైతులు సమావేశాలు ఏర్పాటు చేసుకొని పరస్పరం చర్చించు కోవడానికి వీలుగా రైతువేదికలను తెలంగాణ ప్రభుత్వం నిర్మించింది. ఈ రకమైన ప్రయత్నం దేశంలో ఎక్కడా ఏ రాష్ట్ర ప్రభుత్వం చేయలేదు. 572 కోట్ల 22 లక్షల రూపాయల ఖర్చుతో 2,601 రైతు వేదికలను ప్రభుత్వం ఇప్పటివరకూ నిర్మించింది. ఇంత పెద్ద కార్యక్రమాన్ని కేవలం ఆరునెలల్లో పూర్తిచేయడమనేది ఒక అద్భుతం. దీని కోసం కరోనా కాలంలోను రేయింబవళ్లు పనిచేసి రైతువేదికల నిర్మాణం పూర్తి చేసినందుకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి గారిని, వ్యవసాయ, పంచాయతీరాజ్ శాఖల కార్యదర్శులను, అన్ని జిల్లాల కలెక్టర్లను, వారి సిబ్బందిని ప్రభుత్వం ప్రత్యేకంగా అభినందిస్తున్నది. పంట ఆరబెట్టుకునేందుకు 750 కోట్ల రూపాయలతో లక్ష మంది రైతులకు వారి పొలాల దగ్గరే కల్లాలను ప్రభుత్వం నిర్మిస్తున్నది. దేశంలో ఒక్క తెలంగాణ రాష్ట్రమే ఈ విధంగా రైతులకు పెద్దఎత్తున కల్లాల నిర్మాణం జరుపుతోంది. వ్యవసాయ రంగంలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన వినూత్న పథకాలను అధ్యయనం చేసేందుకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో వ్యవసాయ విద్యార్థులు, నిపుణులు, ఔత్సాహిక రైతులు తరచుగా

తెలంగాణను సందర్శిస్తున్నారు. నేడు తెలంగాణ వ్యవసాయరంగం దేశానికి ఆదర్శంగా నిలిచింది.

**వ్యవసాయ యాంత్రీకరణ:**

32. మారుతున్న కాలమాన పరిస్థితులకు అనుగుణంగా వ్యవసాయ రంగంలో వచ్చే కొత్త పద్ధతులను ఎప్పటికప్పుడు అందిపుచ్చుకోవాలి. వ్యవసాయ రంగంలో నేడు మానవ వనరుల కొరత వల్ల యాంత్రీకరణ అనివార్యమవుతోంది. రైతులకు పెట్టుబడి వ్యయంతో పాటూ, పని భారం కూడా యాంత్రీకరణ వల్ల తగ్గుతుంది. సమయం కూడా ఆదా అవుతుంది. ఉత్పాదకత పెరుగుతుంది. ఈ నేపథ్యంలో రైతులు తమకు కావాల్సిన అధునాతన యంత్రాలను సమకూర్చుకోవడానికి ప్రభుత్వం పూర్తి స్థాయిలో ఆర్థిక మద్దతునివ్వాలని నిర్ణయించింది. గత 5 సంవత్సరాల్లో ప్రభుత్వం 14,644 ట్రాక్టర్లను సబ్సిడీపై రైతులకు అందజేసింది. రైతులకు ట్రాక్టర్లు, ఇతర వ్యవసాయ యంత్రాలు, పరికరాల కోసం ఇప్పటి వరకు రూ.951 కోట్లను ప్రభుత్వం ఖర్చు చేసింది.

33. ఈ ఆర్థిక సంవత్సరం యాంత్రీకరణను పెద్దఎత్తున ప్రోత్సహించేందుకు ఈ బడ్జెట్ లో ప్రభుత్వం 1500 కోట్ల రూపాయలు ప్రతిపాదిస్తున్నది.

రైతుబంధు:

34. పంటకాలంలో రైతుకు పెట్టుబడి సహాయం అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం 2018 సంవత్సరంలో రైతుబంధు పథకాన్ని ప్రారంభించింది. ఈ పథకం యావద్దేశానికి ఆదర్శంగా నిలిచింది. మొదటి దశలో రెండు పంటలకు ఎకరాకు 8 వేల రూపాయల చొప్పున ప్రభుత్వం పెట్టుబడి సాయం అందించింది. 2019 సంవత్సరంలో ఆ సహాయం మొత్తాన్ని రెండు పంటలకి కలిపి 10 వేల రూపాయాలకు పెంచింది.

35. కరోనాతో రాష్ట్ర ఆదాయం తగ్గినప్పటికీ రైతుబంధు సాయాన్ని మాత్రం ప్రభుత్వం ఆపలేదు. సకాలంలో రైతుల ఖాతాల్లో జమ చేసింది. గత వానకాలం పంట సమయంలో రైతుబంధు సహాయాన్ని ప్రభుత్వం కేవలం 24 గంటల వ్యవధిలోనే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న రైతులందరి ఖాతాలలో జమ చేసింది. ఈ పథకం కింద 2021 వానాకాలం మరియు యాసంగిలో 59 లక్షల 25 వేల 725 మంది

రైతులకు 14,736 కోట్లను ప్రభుత్వం అందించింది. గడిచిన మూడేళ్లలో రైతు బంధు పథకం కింద 35,911 కోట్ల రూపాయలను రైతులకు అందించింది. లబ్ధిపొందిన రైతుల్లో 53 లక్షల 26 వేల 778 మంది అంటే 90 శాతం మంది చిన్న, సన్నకారు రైతులే కావడం గమనార్హం .

36. తెలంగాణ ప్రభుత్వం ఈ ఏడాది బడ్జెట్ లో రైతుబంధు పథకం కోసం 14,800 కోట్ల రూపాయలు ప్రతిపాదిస్తున్నది.

37. గత ఎన్నికల సందర్భంలో రాష్ట్రంలోని రైతులకు, లక్షలోపు ఉన్న పంట రుణాలు మాఫీ చేస్తామని హామీ ఇచ్చాం. 25 వేల రూపాయల లోపు ఉన్న రుణాలను ఇప్పటికే మాఫీ చేశాం. కరోనా పరిస్థితుల నేపథ్యంలో మిగతా రైతులకున్న రుణాలను రద్దు చేయడంలో కొంత ఆలస్యం జరిగింది. త్వరలోనే ఈ రుణాలను కూడా ప్రభుత్వం మాఫీ చేస్తుంది.

38. తెలంగాణ ప్రభుత్వం ఈ ఏడాది బడ్జెట్ లో రైతుల రుణమాఫీ కోసం రూ.5,225 కోట్లు ప్రతిపాదిస్తున్నది.

రైతుబీమా:

39. ఏ కారణంతోనైనా రైతు గనుక మరణిస్తే ఆ రైతు కుటుంబం అనాథ కావద్దని ప్రభుత్వం భావించింది. రైతు కుటుంబాల సంక్షేమం కోసం రైతు బీమా పథకాన్ని అమల్లోకి తెచ్చింది. గుంట భూమి ఉన్న రైతు చనిపోయినా ఆ రైతు కుటుంబానికి అయిదు లక్షల బీమా సొమ్ము చెల్లిస్తోంది. రైతు బీమా పథకం ద్వారా 2020-21 సంవత్సరంలో 32.73 లక్షల మంది రైతులకు సంబంధించిన ప్రీమియం మొత్తం రూ.1141.4 కోట్లను ప్రభుత్వం ఎల్.ఐ.సీ కి చెల్లించింది. గత మూడు సంవత్సరాల్లో 46,564 రైతు కుటుంబాలకు 2,328 కోట్ల రూపాయలను అందించింది. తెలంగాణ ప్రభుత్వం రైతుల తోపాటు వారి కుటుంబాలను కూడా ఆదుకుంటూ పరిపాలనలో మానవీయ కోణాన్ని ఆవిష్కరిస్తోంది.

40. గుంట భూమి కలిగి ఉన్నా రైతు బీమా వర్తిస్తుండడంతో ప్రతీ ఒక్కరు తమ పేరుతో ఎంతో కొంత భూమి ఉండాలని కోరుకుంటున్నారు. ఉన్న భూమిని కూడా కుటుంబంలోని వారసులకు పంచి ఇస్తున్నారు. దీనివల్ల పాలసీదారుల సంఖ్య పెరుగుతోంది. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర ప్రభుత్వం

రైతుబీమా పథకానికి చేసిన కేటాయింపును వచ్చే ఆర్థిక సంవత్సరంలో 1,200 కోట్ల రూపాయలకు పెంచాలని నిర్ణయించింది.

41. ఈ బడ్జెట్ లో వ్యవసాయానికి 25 వేల కోట్ల రూపాయలను ప్రభుత్వం ప్రతిపాదిస్తున్నది.

పాడి పరిశ్రమాభివృద్ధి:

42. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి పంటలెంత కీలకమో, పాడి కూడా అంతే కీలకం. ఇవాళ గ్రామాల్లో కొన్ని కుటుంబాలు పాల అమ్మకాల మీదనే ఆధారపడి జీవిస్తున్నాయి. సమైక్య రాష్ట్రంలో ప్రభుత్వాలు పాడి పరిశ్రమను వట్టిపోయిన ఆవులా మార్చాయి. తెలంగాణ ప్రభుత్వం హయాంలో పాడిపరిశ్రమ కామధేనువులా మారింది. వివిధ డెయిరీలు సేకరించే పాలలో ప్రతీ లీటరుపై 5 రూపాయలను అదనంగా చెల్లిస్తూ ప్రభుత్వం పాడి రైతులకు ప్రత్యేక ప్రోత్సాహాన్ని అందిస్తోంది. తెలంగాణ ఏర్పడే నాటికి విజయా డెయిరీ పాల సేకరణ సగటున రోజుకు 1,27,462 లీటర్లు మాత్రమే ఉండగా ప్రభుత్వం తీసుకున్న చర్యలతో నేడది 2,89,969 లీటర్లకు పెరిగింది.

43. తెలంగాణ ఏర్పడిన నాడు విజయ డెయిరీ 30 కోట్ల రూపాయల అప్పుతో దయనీయ స్థితిలో ఉండేది. తెలంగాణ ప్రభుత్వం పగ్గాలు

చేపట్టిన తర్వాత విజయ డెయిరీ మీద ప్రత్యేక దృష్టి సారించింది. డెయిరీ అభివృద్ధికి అవసరమైన అన్ని రకాల తోడ్పాటును అందించింది. నిర్వహణా సామర్థ్యాన్ని మెరుగు పర్చింది. క్రమక్రమంగా సంస్థను లాభాల బాట పట్టించింది. నేడు విజయ డెయిరీ తనకున్న అప్పులు పూర్తిగా చెల్లించడమే కాకుండా, 58.5 కోట్ల రూపాయలను ఫిక్స్‌డ్ డిపాజిట్ల రూపంలో కలిగి ఉంది. విజయడెయిరీ వార్షిక టర్నోవర్ 676 కోట్ల రూపాయలకు చేరుకున్నది. ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకోవడానికి తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న కృషికి విజయడెయిరీ నిలువెత్తు సాక్ష్యం.

44. పశు సంవర్ధక మరియు మత్స్యశాఖకు ఈ బడ్జెట్ లో 1,730 కోట్ల రూపాయలను ప్రతిపాదిస్తున్నది.

ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమ:

45. వ్యవసాయ ఉత్పత్తులను ప్రాసెస్ చేస్తే రైతులకు ఎక్కువ ఆదాయం వస్తుంది. తెలంగాణ ప్రభుత్వం ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల స్థాపనను రాష్ట్రవ్యాప్తంగా ప్రోత్సహించాలని నిర్ణయించింది. మహిళా సంఘాల ద్వారా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల నిర్వహణ జరగాలని విధానపరమైన నిర్ణయం తీసుకున్నది. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల

ద్వారా రైతులకు ప్రయోజనాలు కలుగడమే కాకుండా గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి ఏర్పడుతుంది.

సాగునీటి రంగం:

46. యావత్ జీవకోటి మనుగడకు గాలి తర్వాత అంత ముఖ్యమైంది నీరే. కాటన్ మహాశయుడు అన్నట్లు బంగారు గనుల ద్వారా వచ్చే ఆదాయం కన్నా భూమికి నీటి వసతి కల్పిస్తే వచ్చే ఆదాయమే ఎక్కువ. నీరు సమృద్ధిగా లభించిన చోట వ్యవసాయం, పరిశ్రమలు అన్ని రంగాలూ కళకళలాడుతాయి. ఆ నీరే లేకపోతే అన్నీ వెలవెల పోతాయి. నీటి ప్రాధాన్యత అందరికన్నా తెలంగాణకే ఎక్కువ తెలుసు. ఎందుకంటే తలాపున నదులు పారుతున్నా కూడా తెలంగాణ నీటి కోసం గోస పడింది. చెరువులు ధ్వంసమైపోయి, బావులు, బోర్లు ఎండిపోయి, భూగర్భ జలాలు అడుగంటి అష్టకష్టాలు అనుభవించింది.

47. తెలంగాణ స్పృహ లేని గత పాలకులు అంతరరాష్ట్ర వివాదాలకు ఆస్కారం కలిగించే విధంగా ప్రాజెక్టులకు రూపకల్పన చేశారు. అంతే కాకుండా రిజర్వాయర్ల నీటి సామర్థ్యాలను తగ్గించారు. అందుకనే కేసీఆర్ గారు స్వయంగా పూనుకుని ప్రాజెక్టుల రీడిజైనింగ్ ను పర్యవేక్షించారు. అంతరరాష్ట్ర వివాదాలను సహృద్భావ వాతావరణంలో

పరిష్కరించుకుని శరవేగంగా ప్రాజెక్టుల నిర్మాణం ప్రారంభించారు. గోదావరి నదిపై కాళేశ్వరం ప్రాజెక్టు దాదాపు పూర్తయింది. సీతారామ ప్రాజెక్టు పూర్తి కావొస్తోంది. అదే విధంగా పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పనులు వేగంగా జరుగుతున్నాయి.

48. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం రాష్ట్ర చరిత్రలో ఓ అపురూప ఘట్టం. మేడిగడ్డ వద్ద సముద్రమట్టానికి వంద మీటర్ల ఎత్తులో ప్రవహించే గోదావరి నీటిని, 618 మీటర్ల ఎత్తున ఉన్న కొండ పోచమ్మ సాగర్ లోకి తీసుకువచ్చిన అద్భుతమైన సన్నివేశానికి మనమంతా సాక్షులుగా నిలిచాం. గత బడ్జెట్ ప్రసంగంలో ప్రకటించిన విధంగానే రంగనాయక సాగర్, కొండ పోచమ్మ సాగర్‌లను నిర్ణీత వ్యవధిలో పూర్తి చేసాం. ఈ రిజర్వాయర్ల ద్వారా ప్రస్తుత యాసంగి పంటకు రైతులకు నీరందించి వారి హృదయాల్లో సంతోషాన్ని నింపాం. ఇవాళ ఈ ప్రాజెక్టుల ద్వారా నీరందుతున్న ఏ ఊరికి పోయినా మా చెరువు నిండిందని, మా కాల్వ పారిందని.. మా పొలం పండిందని సంబురంగా చెబుతున్నారు.

49. ఉమ్మడి నల్గొండ జిల్లా సాగు నీటి అవసరాల కోసం తలపెట్టిన డిండి ఎత్తిపోతల పథకం పనులు వేగంగా జరుగుతున్నాయి. త్వరలోనే ప్రాజెక్టు పూర్తవుతుంది.

50. దేవాదుల ప్రాజెక్టు లో భాగమయిన సమ్మక్క సాగర్ (తుపాకుల గూడెం) దాదాపు పూర్తయ్యింది. సీతారామ ప్రాజెక్టులో భాగమయిన సీతమ్మ సాగర్ (దుమ్ముగూడెం) బ్యారెజీ నిర్మాణ పనులు త్వరలో ప్రారంభం కానున్నాయి.

**కొత్త లిఫ్టుల నిర్మాణం...**

51. ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా సాగునీటి సదుపాయాన్ని మరింత పెంచే లక్ష్యంతో అనేక కొత్త లిఫ్టులను మంజూరు చేసింది.

నాగార్జున సాగర్ నియోజకవర్గంలో నెల్లికల్ లిఫ్టు

దేవరకొండ నియోజకవర్గంలో: పోగిల్ల, కంబాలపల్లి, నంబాపురం-పెద్దగట్టు, పెద్దమునిగాల, అక్కంపల్లి లిఫ్టులను

మిర్యాల గూడ నియోజకవర్గంలో: దున్నపోతుల గండి-బాల్నేపల్లి, బాప్లాతండా, కేశవపురం-కొండ్రాపోల్, బొత్తలపాలెం-వాడపల్లి, వీర్లపాలెం, తోపుచర్ల లిఫ్టులను

హుజూర్‌నగర్ నియోజకవర్గంలో: ఎంబీసీ-ముక్త్యాల బ్రాంచి కెనాల్, జాన్‌పాడ్ లిఫ్టులను

జుక్కల్ నియోజకవర్గంలో: నాగ మడుగు లిఫ్టును

బాన్సువాడ నియోజకవర్గంలో: జకోరా, చందూర్ లిఫ్టులను

ఆర్మూరు నియోజకవర్గంలో : ముచ్చర్ల, కంప్టం-చిక్లీ లిఫ్టులను

బాల్కొండ నియోజకర్గంలో: చిట్టాపూర్ లిఫ్టును

ధర్మపురి నియోజకవర్గంలో: స్తంభం పల్లి, వెల్గటూరు, దమ్మనపేట లిఫ్టులను

ముథోల్ నియోజకవర్గంలో: పిప్రి లిఫ్టును, గద్వాల నియోజకవర్గంలో గట్టు లిఫ్టు, దుబ్బాక నియోజకవర్గంలో ఎల్లారెడ్డిపేట లిఫ్టు, ప్రభుత్వం ఇప్పటికే మంజూరు చేసింది. ఇవేకాకుండా మరికొన్ని లిఫ్టులకు సంబంధించిన డీపీఆర్‌లను సిద్ధం చేసింది. వాటి వివరాలు...

కొల్లాపూర్ నియోజకవర్గంలోని గోపాలదిన్నె, నాగర్ కర్నూలు నియోజకవర్గంలోని మార్కండేయ లిఫ్టు, జహీరాబాద్, సంగారెడ్డి నియోజకవర్గాలలో సంగమేశ్వర లిఫ్టును, నారాయణఖేడ్ నియోజకవర్గంలోని బసవేశ్వర లిఫ్టు, తూర్పు ఆదిలాబాద్‌లోని ఆసిఫాబాద్, సిర్పూరు, బెల్లంపల్లి, చెన్నూరు, మంచిర్యాల నియోజకవర్గాల కోసం అయిదు లిఫ్టులకు, ఇల్లెందు నియోజకవర్గంలోని ఇల్లెందు లిఫ్టుకు, భద్రాచలం నియోజకవర్గంలోని

ప్రగడపల్లి లిఫ్టుకు డీపీఆర్‌లు సిద్ధమయ్యాయి. వీటికి అనుమతులను ప్రభుత్వం త్వరలోనే మంజూరు చేస్తుంది.

మిషన్ కాకతీయ:

52. చెరువులు తెలంగాణ కల్పతరువులు. వ్యవసాయంతో సహా అనేక వృత్తులకు చెరువులే ఆధారం. సమైక్య రాష్ట్రంలో చెరువు చుట్టూ ఆధారపడిన సామాజిక, ఆర్థిక వ్యవస్థ ఛిన్నాభిన్నమైపోయింది. తెలంగాణ ప్రభుత్వం చెరువులను పునరుద్ధరించేందుకు ప్రవేశపెట్టిన మిషన్ కాకతీయ పథకం సత్ఫలితాలను సాధించింది. ఈ పథకం ద్వారా వేలాది చెరువులు బాగుపడ్డాయి. లక్షలాది ఎకరాల ఆయకట్టు స్థిరీకరించబడింది. చెరువులలో నీటి సామర్థ్యం పెరగడంతో చేపల పెంపకం ఊపందుకుంది.

53. మత్స్య కారులకు ఆదాయం పెరిగింది. తెలంగాణ వ్యాప్తంగా భూగర్భ జల మట్టాలు పెరిగాయి.

54. గతంలో చిన్న వాన పడినా చెరువు కట్టలు తెగేవి. ఈ ఏడాది కనీవినీ ఎరుగని స్థాయిలో వానలు పడ్డాయి. వానల ధాటికి ఒకటి అరా మినహాయించి చెరువుల కట్టలేవీ తెగలేదు. గండ్లు పడలేదు.

మిషన్ కాకతీయతో జరిగిన అభివృద్ధి వల్ల జోరు వానలు పడినా చెరువులు చెక్కు చెదరకుండా ఉన్నాయి.

55. సాగునీటి రంగానికి ఈ బడ్జెట్లో 16,931 కోట్ల రూపాయలను ప్రతిపాదిస్తున్నాం.

మిషన్ భగీరథ:

56. 'చూడు చూడు నల్లగొండ...గుండె మీద ఫ్లోరైడు బండ. బొక్కలొంకరవోయిన బతుకులా మన నల్లగొండ. దుక్క మెల్లాదీసేదెన్నాళ్ళు ... ఇది నల్లగొండ తాగు నీటి కష్టాలను చూసి చలించిన ముఖ్యమంత్రి గారు స్వయంగా రాసిన పాట. ఆనాడు ఫ్లోరైడ్ దుఃఖం మీద ఆవేదనతో పాట రాసిన ఆయనే ఈనాడు ఫ్లోరైడ్ పీడను శాశ్వతంగా తొలగించారు. నల్గొండలో ఫ్లోరైడ్ పీడ అంతమయిందని, కొత్తగా ఎవరూ ఫ్లోరోసిస్ బారిన పడటం లేదని కేంద్ర ప్రభుత్వం పార్లమెంటు వేదికగా ప్రకటించింది. మిషన్ భగీరథ పథకం నల్గొండ ఫ్లోరైడ్ కష్టాలకు చరమగీతం పాడింది.

57. ఉమ్మడి రాష్ట్రంలో ఎండకాలం వస్తే చాలు, మహిళలు కుండలు పట్టుకుని మైళ్లు మైళ్లు నడిచి నీళ్లు తెచ్చుకోవాల్సిన దురవస్థ

అనుభవించే వారు. ఆదిలాబాద్ ఆదివాసీ ప్రాంతాల్లో జనం కలుషిత జలాలు తాగి డయేరియా కారణంగా మరణాల బారిన పడేవారు .

58. పబ్లిక్ నల్లాల వద్ద వీధిపోరాటాలు, ఎమ్మెల్యేలను నిందిస్తూ ఖాళీ బిందెల ప్రదర్శనలు, అసెంబ్లీ ఆవరణలో నీళ్ల కోసం నిరసనలు, శాసన సభ లోపల నీటి ఎద్దడి గురించి వాయిదా తీర్మానాలు, ఏ పార్టీ అధికారంలో ఉన్నా 70 ఏళ్లుగా ఇదే తంతు కొనసాగింది.

59. తెలంగాణ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రి కేసీఆర్ గారు ఐదేళ్లలోనే తాగు నీటి కష్టాలను తీరుస్తానని, లేని పక్షంలో ఓట్లు అడగనని శపథం చేశారు. తెలంగాణ ప్రభుత్వం పట్టుదలతో పని చేసి మిషన్ భగీరథ పథకాన్ని వేగంగా పూర్తి చేసింది. మిషన్ భగీరథ ద్వారా రాష్ట్రంలోని అన్ని అవాసాలకి శుద్ధి చేసిన సురక్షిత జలాలు ఇంటింటికి నల్లాల ద్వారా అందుతున్నాయి.

60. నేడు రాష్ట్రంలో ఆడబిడ్డలు బిందెలు పట్టుకుని బజారులో తిరగాల్సిన బాధలు లేవు. అతిసారతో ఆదివాసీల మరణాలు లేవు. శాసన సభలో తాగు నీటి కోసం చర్చలు లేవు. నిరసనలు అంతకన్నా లేవు. దేశం మొత్తం మీద తాగు నీటి సమస్యను సంపూర్ణంగా అధిగమించిన రాష్ట్రంగా తెలంగాణ ప్రతిష్ట పెరిగింది.

61. ఇంటింటికి స్వచ్ఛమైన తాగు నీటిని అందిస్తోన్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని కేంద్రానికి చెందిన జల్ జీవన్ మిషన్ అధికారికంగా ప్రకటించింది.

**భూపరిపాలనలో సంస్కరణలు:**

62. భూపరిపాలనలో తెలంగాణ నూతనాధ్యయానికి శ్రీకారం చుట్టింది. తెలంగాణ రాష్ట్ర భూమి హక్కులు-పట్టదారు పాసుపుస్తకాల చట్టం-2020 ని అమలులోకి తెచ్చింది. నూతన రెవెన్యూ చట్టాన్ని ప్రవేశపెడుతూ ముఖ్యమంత్రి గారు శాసన సభలో ఈ చట్టం ద్వారా రైతులకు భూవివాదాలు, తగాదాల నుండి శాశ్వత పరిష్కారం లభిస్తుంది కనుక నాకు తెలంగాణ రాష్ట్రం వచ్చిననాడు ఎంత సంతోషం కలిగిందో, ఈ రోజు కూడా అంతే సంతోషం కలుగుతోంది అని అన్నారు.

63. భూ యజమాన్య హక్కులకు సంబంధించిన చట్టాలు, రికార్డులు లోపభూయిష్టంగా ఉండటం వల్ల భూవివాదాలు పెద్ద సమస్యగా తయారయ్యాయి. ఈ పరిస్థితి మారకుండా పల్లెల్లో ప్రశాంతత రాదని ముఖ్యమంత్రి గారు భావించారు.

64. ఏ రాష్ట్రంలో ఎవరూ పూనుకోని విధంగా భూరికార్డుల ప్రక్షాళనను ప్రారంభించారు. ఈ కార్యక్రమం వల్ల దాదాపు 95 శాతం భూములకు సంబంధించిన యాజమాన్య హక్కులపై స్పష్టత వచ్చింది. కొత్త పాస్ పుస్తకాలు రైతులకు అందాయి. రైతుల భూముల వివరాలు స్పష్టంగా ఉండటం వల్ల రైతుబంధు సాయం దాదాపు 60 లక్షల మంది రైతులకు ఏ మాత్రం ఇబ్బంది లేకుండా అందించగలుగుతున్నాం.

65. భూ రికార్డులను అందరికీ పారదర్శకంగా అందుబాటులో ఉంచేందుకు ప్రభుత్వం ధరణి పోర్టల్ రూపొందించింది. ధరణి భూపరిపాలనలో నూతన శకానికి నాంది పలికింది. ఈ పోర్టల్ సాయంతో ప్రపంచంలో ఎక్కడ నుండి అయినా, ఎవరైనా తమ భూముల వివరాలు తెలుసుకోవచ్చు. ఇప్పటి వరకు 2 కోట్ల 17 లక్షల మంది ధరణి పోర్టల్ ను వీక్షించడం జరిగింది.

66. ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన రిజిస్ట్రేషన్, మ్యూటేషన్ విధానం వల్ల ప్రజలకు ఎంతో సౌకర్యం కలిగింది. ప్రక్రియ చాలా సులభతరమైంది. పారదర్శకత పెరిగింది. దీంతో రిజిస్ట్రేషన్, మ్యుటేషన్, పాస్ పుస్తకాల జారీ ప్రక్రియ అంతా చకచకా జరుగుతోంది. ఇప్పటి వరకు 3 లక్షల 29 వేల లావాదేవీలు

జరిగాయి. 1 లక్ష 6 వేల పెండింగ్ మ్యూటేషన్లు పూర్తయ్యాయి. రిజిస్ట్రేషన్, మ్యుటేషన్లలో అవినీతికి ఆస్కారం ఉండకూడదని అధికారుల విచక్షణాధికారాన్ని ప్రభుత్వం తొలగించింది.

67. పక్కాగా భూరికార్డులు తయారు చేసే లక్ష్యంతో డిజిటల్ విధానంలో సమగ్ర భూ సర్వేను ఈ సంవత్సరం జరపాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ సర్వే ఆదారంగా  అక్షాంశ, రేఖాంశాలతో సహా స్పష్టమైన హద్దుల వివరాలతో  పాస్ బుక్కులను అందించనున్నాం. ఈ విధానం వల్ల రికార్డుల వక్రీకరణ (ట్యాంపరింగ్)కు ఎంత మాత్రం అవకాశం ఉండదు. వ్యవసాయ భూముల హద్దులు మాత్రమే కాకుండా, దేవాలయ భూముల, వక్ఫ్ భూముల, అటవీ భూముల, ఇతర ప్రభుత్వ భూముల హద్దుల వివాదాలు కూడా పరిష్కారమవుతాయి.

68. ఈ బడ్జెట్‌లో సమగ్ర భూ సర్వే కోసం 400 కోట్ల రూపాయలను ప్రభుత్వం ప్రతిపాదిస్తున్నది.

ప్రజా సంక్షేమ పథకాలు:

69. తెలంగాణా ప్రభుత్వం సంక్షేమంలో స్వర్ణయుగాన్ని తెచ్చింది. పసి పిల్లల నుంచి పండు ముసలి వాళ్ల దాకా ప్రతీ ఒక్కరికీ సంక్షేమ

ఫలాలను అందిస్తున్న ఒకే ఒక్క రాష్ట్రం తెలంగాణ. ఇవాళ రాష్ట్రంలోని ప్రతీ ఇంటికి ఏదో ఒక సంక్షేమ కార్యక్రమం ద్వారా లబ్ధి చేకూరుతుంది. ఇంత పెద్ద ఎత్తున సంక్షేమ కార్యక్రమాలు దేశం లో ఇంకే రాష్ట్రంలోనూ అమలు కావడం లేదు.

**ఆసరా పెన్షన్లు:**

70. అసహాయులకు జీవన భద్రత కల్పించేందుకు తెలంగాణ ప్రభుత్వం ఆసరా పెన్షన్లు అందిస్తున్నది. సమైక్య రాష్ట్రంలో కేవలం 200 రూపాయల పెన్షన్ వస్తే.. ఇవాళ తెలంగాణలో 2,016 రూపాయల పెన్షన్ పేదలకు లభిస్తున్నది. వృద్ధులు, వితంతువులు, బీడీ కార్మికులు, బోదకాలు బాధితులు, కల్లుగీత కార్మికులు, నేతకార్మికులు, ఎయిడ్స్ వ్యాధిగ్రస్థులు, ఒంటరి మహిళలకు 2,016 రూపాయల చొప్పున, వికలాంగులకు 3,016 రూపాయల చొప్పున ఆసరా పెన్షన్లు క్రమం తప్పకుండా ప్రతీ నెలా అందుతున్నాయి.

71. రాష్ట్రంలో 39 లక్షల 36 వేల 521 మందికి ఆసరా పెన్షన్లను పంపిణీ చేస్తున్నాం.

72. ఇందులో 2019-20 సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వం మనిషికి రెండు వందల చొప్పున 6 లక్షల 66 వేల మందికి గాను 105 కోట్ల

రూపాయల సహాయం అందించింది. వీరందరికీ ఒక్కొక్కరికి 1,816 రూపాయలను కలిపి రాష్ట్ర ప్రభుత్వం 2,016 రూపాయల పెన్షన్‌ను అందిస్తోంది.

73. వీరుకాక మిగతా 31 లక్షల 31 వెయ్యి 660 మంది అసహాయులకు నెలకు రూ.2,016 చొప్పున, వికలాంగులకు 3,016 రూపాయల చొప్పున పూర్తి భారాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తూ ఆసరా పెన్షన్లను పంపిణీ చేస్తోంది.

74. 2019-20 ఆడిట్ నివేదిక ప్రకారం పెన్షన్‌ల పంపిణీ కోసం రాష్ట్ర ప్రభుత్వం వెచ్చిస్తున్న సొమ్ము 98.80 శాతం కాగా, కేంద్ర ప్రభుత్వం ఇచ్చింది కేవలం 1.20 శాతం మాత్రమే. దేశంలోని మరే రాష్ట్రం కూడా ఇంత పెద్ద మొత్తంలో అసహాయులకు పెన్షన్లు పంపిణీ చేస్తూ జీవన భద్రత కల్పిస్తున్న దాఖలా లేదు.

75. ఈ బడ్జెట్ లో ఆసరా పింఛన్ల కోసం ప్రభుత్వం 11,728 కోట్ల రూపాయలను ప్రతిపాదిస్తున్నది.

కల్యాణ లక్ష్మి/ షాదీముబారక్:

76. పేద తల్లిదండ్రులు తమ ఆడ పిల్లల పెండ్లిళ్లు చేయడానికి తగిన ఆర్థిక స్థోమత లేక సతమతమవుతున్నారు. ఈ పరిస్థితిని

గమనించిన ముఖ్యమంత్రి గారు మానవీయ ధృక్పథంతో ఆలోచించి కళ్యాణలక్ష్మి/షాదీముబారక్ పథకాన్ని ప్రవేశపెట్టారు. ఈ పథకం ద్వారా పేద ఆడపిల్ల పెళ్లికి లక్ష నూట పదహారు రూపాయల ఆర్థిక సహాయం ప్రభుత్వం అందిస్తోంది. రాష్ట్రంలోని లక్షలాది మంది ఆడపిల్లల పెళ్లిళ్లకు కల్యాణలక్ష్మి /షాదీముబారక్ పథకం ద్వారా ముఖ్యమంత్రి గారి దీవెనలు అందుతున్నాయి. ఆర్థిక సహాయం అందుకున్న ఆడపిల్లల తల్లిదండ్రుల కళ్లల్లో కనిపించే సంతృప్తే మా పరిపాలనకు దక్కిన గొప్ప సార్ధకత అని ఈ సందర్భంగా మనవి చేస్తున్నాను.

77. ఇప్పటివరకు ఈ పథకం ద్వారా 8 లక్షల 4 వేల 521 మందికి, 6,480 కోట్ల రూపాయల లబ్దిని ప్రభుత్వం చేకూర్చింది.

78. కళ్యాణలక్ష్మి/షాదీముబారక్ పథకానికి ఈ బడ్జెట్ లో రూ.2,750 కోట్లు ప్రతిపాదిస్తున్నాం.

షెడ్యూల్ కులాలు - షెడ్యూల్ తెగల సంక్షేమం:

79. అన్ని వర్గాల ప్రజలకు సమాన అవకాశాల కల్పన అనేది ప్రజాస్వామ్య ప్రధాన సూత్రం. షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగల సమగ్ర వికాసం లక్ష్యంగా ప్రత్యేక ప్రగతి నిధి చట్టాన్ని ప్రవేశపెట్టిన ఒకే

ఒక్క రాష్ట్రం తెలంగాణ. ఎస్సీ, ఎస్టీ ప్రజల జనాభా దామాషానుసరించి, కొన్ని సందర్భాల్లో దామాషాకు మించి కూడా ఎస్సీ, ఎస్టీ సామాజికవర్గాల కోసం ప్రత్యేక నిధులు కేటాయిస్తోంది. ఈ నిధులను కేవలం వారి వికాసం కోసమే ఖర్చు చేస్తోంది.

80. ఎస్సీ, ఎస్టీ ప్రజల అభ్యున్నతి కోసం కేటాయించిన నిధులను ఒక ఆర్థిక సంవత్సరంలో పూర్తిగా ఖర్చు చేయకపోతే మిగిలిన నిధులను వచ్చే ఆర్థిక సంవత్సరానికి బదలాయించేలా చట్టంలో నిబంధన పెట్టింది. ఈ విధమైన నిబంధన దేశంలో తొలిగా తెలంగాణ రాష్ట్రమే ప్రవేశపెట్టి ఆదర్శంగా నిలిచింది. ఇటీవలే రాజస్థాన్ ప్రభుత్వం మన రాష్ట్రంలోని ఈ విధానాన్ని అధ్యయనం చేసి వారి రాష్ట్రంలో కూడా ఇదే విధానాన్ని అనుసరించాలని నిర్ణయించింది.

81. ఈ చట్టాన్ని అమలు చేస్తూ తెలంగాణ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతిలో ఆదర్శంగా నిలిచింది. ఎస్సీ, ఎస్టీ ప్రగతి నిధి ద్వారా ఖర్చు చేసిన నిధుల వివరాలను, అమలు చేసిన కార్యక్రమాల వివరాలను గత సంవత్సరం నుంచి గౌరవ సభ్యులందరికీ పెన్‌డ్రైవ్ ద్వారా అందజేస్తున్నాం. అదేవిధంగా ఈ సంవత్సరం కూడా అందిస్తున్నాం. గౌరవ సభ్యులు ఆ వివరాలన్నింటిని పరిశీలించాలని సవినయంగా మనవి చేస్తున్నాను.

82. భారతరత్న డా.బీ.ఆర్.అంబేద్కర్ విద్య ప్రాధాన్యాన్ని గురించి వ్యాఖ్యానిస్తూ  నాగరికత వల్ల కలిగే సంపద, సుఖాలు, విలాసాలను వదులు కోవచ్చును కానీ, విద్యవల్ల కలిగే జ్ఞానాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ  వదులుకోకూడదు. విద్య లేకుండా వెనుకబడిన తరగతుల ప్రజలు తమ మనుగడను కాపాడుకోలేరు అని అన్నారు. వెనుకబడిన వర్గాల్లో ఒక తరాన్ని విద్యావంతులుగా తీర్చదిద్దగలిగితే చాలు, ఆ తరం అడుగు జాడల్లో మరో తరం ముందడుగు వేస్తుందని ముఖ్యమంత్రి గారి విశ్వాసం.

83. తెలంగాణ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాలు విద్యావిషయకంగా ఉన్నతమైన అభివృద్ధి పొందడానికి ప్రత్యేక గురుకులాలను ఏర్పాటు చేసింది. ఈ విద్యాలయాల్లో అంతర్జాతీయ ప్రమాణాలతో విద్య, శిక్షణను అందిస్తోంది.

84. 2014 వరకు తెలంగాణలో ఎస్సీ గురుకుల విద్యాలయాలు కేవలం 134 మాత్రమే ఉండేవి.  తెలంగాణ  ఏర్పడిన తర్వాత ప్రభుత్వం ఎస్సీ గురుకులాల సంఖ్యను 268 కి పెంచింది. రాష్ట్రం ఏర్పడే నాటికి ఎస్సీ గురుకులాల్లో 82,063 మంది విద్యార్థులు చదువుతుండగా, ఇప్పుడు 1,45,985 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఎస్సీ గురుకులాల కోసం 2014 లో 590.60

కోట్ల రూపాయలను ఖర్చు చేయగా 2019-20 నాటికి 898 కోట్ల రూపాయలను ఖర్చు చేయడం జరిగింది.

85. 2014లో గిరిజన విదా ర్థుల కోసం ఏర్పాటు చేసిన గురుకులాలు 96 ఉంటె 2021 నాటికి 133 కు ప్రభుత్వం పెంచింది. విద్యార్థుల సంఖ్య 2014 లో 27,574 ఉండగా 2021 నాటికి ఆ సంఖ్య 66,943 కు పెరిగింది. అలాగే, 2014లో 99.62 కోట్లు ఎస్టీ గురుకులాల కోసం ఖర్చు చేయగా 2020-21 నాటికి 529.60 కోట్ల రూపాయలను వెచ్చించింది.

86. దళిత, గిరిజన విద్యార్థినులు చదువు మధ్యలో మానేయవద్దని, ఆడపిల్లలు తప్పకుండా ఉన్నత విద్యను చదువుకోవాలని ముఖ్యమంత్రి గారి సంకల్పం. ఎస్సీ, ఎస్టీ విద్యార్థినులు ఉన్నత విద్య అభ్యసించడం కోసం దేశంలోనే తొలిసారిగా రాష్ట్రంలో 53 మహిళా రెసిడెన్షియల్ డిగ్రీ కాలేజీలను ప్రభుత్వం నూతనంగా ప్రారంభించింది. ఐదు డిగ్రీ కళాశాలల్లో పీజీ కోర్సులను ప్రవేశపెట్టింది. దీన్ని పదిహేనవ ఆర్థిక సంఘం ప్రత్యేకంగా అభినందించింది. ఎస్సీ, ఎస్టీలకు తెలంగాణ ప్రభుత్వం అందిస్తోన్న మెరుగైన విద్యా సౌకర్యాలను అధ్యయనం చేసేందుకు పద్నాలుగు రాష్ట్రాల ప్రతినిధులు  మన రాష్ట్రాన్ని సందర్శించారు.  మన రాష్ట్ర  సాంఘిక సంక్షేమ గురుకుల విద్యా

విధానం ద్వారా సాధించిన గుణాత్మకమైన మార్పును హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో ఒక కేస్ స్టడీగా స్వీకరించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో గురుకుల విద్యాలయ విద్యార్థులకు కేవలం ఆరు మెడికల్ సీట్లు మాత్రమే వచ్చేవి. నేడు తెలంగాణలోని గురుకుల విద్యాలయాల నుండి 189 మంది విద్యార్థులు ఎంబీబీఎస్, బీడీఎస్ సీట్లను సాధించారు. అలాగే, 170 మంది ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు ఐఐటీ, జే.ఇ.ఇ. సీట్లను సాధించి రాష్ట్ర కీర్తిని పెంచారు.

87. తెలంగాణ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ విద్యా వికాసం కోసం చేస్తోన్న కృషిని బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా గుర్తించింది. దేశవ్యాప్తంగా లా కాలేజీల మంజూరీపై ఉన్న మారటోరియాన్ని సడలించి, మన రాష్ట్రంలో రెండు గురుకుల ఇంటిగ్రేటెడ్ లా కాలేజీలు ఏర్పాటు చేయడానికి ప్రత్యేక అనుమతి ఇచ్చింది. తెలంగాణ ప్రభుత్వం దేశంలోనే తొలిసారిగా ఎస్టీ బాలుర కోసం న్యాయవిద్యా గురుకుల కళాశాలను సంగారెడ్డిలో ఏర్పాటు చేసింది. దళిత బాలికల కోసం ఎల్బీనగర్ లో మరో న్యాయవిద్యా గురుకులాన్ని ప్రారంభించింది.

88. దేశంలో ఎక్కడ లేనివిధంగా విదేశాలలో విద్యను అభ్యసిస్తున్న షెడ్యూల్ కులాల విద్యార్థులకు 20 లక్షల రూపాయల చొప్పున డా.బీ.ఆర్.అంబేద్కర్ ఓవర్సీస్ స్కాలర్ షిప్పులను ప్రభుత్వం

అందజేస్తున్నది. ఇప్పటి వరకు 623  మంది విద్యార్థులు ఈ స్కాలర్ షిప్ అందుకున్నారు. అందుకోసం 107.8 కోట్ల రూపాయల మొత్తాన్ని స్కాలర్ షిప్పుల కోసం ప్రభుత్వం వెచ్చించింది.

89. విదేశాలలో విద్యను అభ్యసిస్తున్న షెడ్యూల్ తెగలకు చెందిన 180 మంది విద్యార్థుల కోసం 27.78 కోట్ల రూపాయలను వెచ్చిస్తున్నాం.

90. ఎస్సీ, ఎస్టీ పారిశ్రామిక వేత్తలకు అండగా నిలిచేందుకు TS-PRIDE అనే కార్యక్రమాన్ని ప్రభుత్వం అమలు చేస్తోంది. కొత్తగా పరిశ్రమలు ఏర్పాటుకు ముందుకు వచ్చే వారికి పావల వడ్డీ రుణాలు, విద్యుత్ రాయితీలు కల్పిస్తున్నాం. ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ మహిళా పారిశ్రామికవేత్తలకు ఇచ్చే సబ్సిడీని 35 శాతం నుండి 45 శాతానికి పెంచింది. సేల్స్ టాక్స్ మినహాయింపును 100 శాతానికి పెంచింది. 2014 నుంచి ఇప్పటి వరకు ఎస్సీ, ఎస్టీలకు పరిశ్రమల స్థాపన కోసం 39,590 యూనిట్లను 1,919 కోట్ల రూపాయల సబ్సిడీతో మంజూరు చేయడం జరిగింది.

91. బీటీ రోడ్డు సౌకర్యంలేని ఎస్టీ నివాస సముదాయాలకు (హాబిటేషన్లకు) ఈ బడ్జెట్ లో 165 కోట్ల రూపాయల నిధులను

ప్రతిపాదిస్తున్నాం. వీటి ద్వారా గిరిజన ఆవాసాలకు చక్కని రోడ్లు నిర్మాణమవుతాయి.

92. ఎస్టీ గృహాలకు రాయితీపై విద్యుత్తు అందించడానికి 18 కోట్ల రూపాయలను ఈ బడ్జెట్ లో ప్రభుత్వం ప్రతిపాదిస్తున్నది.

93. తమ వ్యవసాయ భూములకు త్రీ ఫేజ్ విద్యుత్తు సౌకర్యం కల్పించాలని ఎంతో కాలంగా గిరిజనులు డిమాండ్ చేస్తున్నారు. గ్రామాలకు దూరంగా ఉండి విద్యుదీకరణకు నోచుకోకుండా ఉన్న గిరిజన వ్యవసాయ భూములన్నింటికీ  త్రీ ఫేజ్ కరెంటు సరఫరాను 103 కోట్ల నిధులతో  చేపడుతున్నాం.

94. ఈ బడ్జెట్ లో ఎస్సీల ప్రత్యేక ప్రగతి నిధి కోసం 21,306.85 కోట్ల రూపాయలను, ఎస్టీల ప్రత్యేక ప్రగతి నిధి కోసం 12,304.23 కోట్ల నిధులను ప్రతిపాదిస్తున్నాం.

**వెనుకబడిన వర్గాల సంక్షేమం:**

95. వెనుకబడిన తరగుతుల ప్రజల జీవితాల్లో వెలుగులు నింపడమే కర్తవ్యంగా తెలంగాణ ప్రభుత్వం భావిస్తోంది. బీసీ వర్గాలను విద్యాపరంగా అభివృద్ధి చేసేందుకు కావాల్సిన చర్యలను తీసుకుంటోంది. కుల వృత్తులకు ఆర్థిక తోడ్పాటును అందిస్తోంది.

96. మహాత్మా జ్యోతీరావు పూలే చెప్పినట్లు lack of education led to oppression of lower castes. విద్య లేకపోవడం వల్ల ఆర్థికాభివృద్ధి ఉండదు. ఆర్థికాభివృద్ధి లేనప్పుడు వెనకబడిన తరగతులు అణిచివేతకు గురవుతాయి. వెనుకబడిన తరగతుల విద్యార్థులకు నేటి ప్రపంచీకరణ పరిస్థితులకు తగిన స్థాయిలో ప్రామాణిక విద్యను అందించడం కోసం మహాత్మ జ్యోతీరావు పూలే పేరుతో బీసీ గురుకులాలను తెలంగాణా ప్రభుత్వం పెద్ద ఎత్తున ఏర్పాటు చేసింది.

97. 2014 నాటికి బీసీ గురుకులాలు 19 మాత్రమే ఉండేవి. వీటిల్లో 7,580 మంది విద్యార్ధులు మాత్రమే ఉండేవారు. గురుకులాల మీద అప్పుడు చేసిన ఖర్చు కేవలం 44 కోట్ల రూపాయలు. తెలంగాణ ప్రభుత్వం బీసీ గురుకులాల సంఖ్యను 281కి పెంచింది. వసతులను గణనీయంగా మెరుగుపర్చింది. విద్యార్థులకు కావల్సిన బట్టలు, పుస్తకాలు, తదితర సామగ్రినంతా ఉచితంగా అందిస్తోంది. ప్రస్తుతం బీసీ గురుకులాల్లో లక్షా 13 వేల 280 మంది విద్యార్థులు చుదువుతున్నారు. గురుకులాల నిర్వహణ కోసం ప్రభుత్వం 2021 లో 545 కోట్ల రూపాయలను కేటాయించడం జరిగింది. తెలంగాణ

ఏర్పడిన నాటితో పోల్చితే బీసీ గురుకులాల నిధులను తెలంగాణా ప్రభుత్వం పదిరెట్లు పెంచింది.

98. ప్రత్యేక హస్టళ్లు, ప్రీ మెట్రిక్, పోస్ట్ మెట్రిక్ స్కాలర్ షిప్పులు, రెసిడెన్షియల్ మహిళ డిగ్రీ కళాశాలల ఏర్పాటు తదితర చర్యల ద్వారా నాణ్యమైన విద్యను వెనకబడిన తరగతుల విద్యార్థులకు తెలంగాణ ప్రభుత్వం అందిస్తోంది.

99. విదేశాల్లో విద్యనభ్యసించే బీసీ కులాలకు చెందిన విద్యార్థులకు 20 లక్షల చొప్పున జ్యోతిరావుపూలే ఓవర్సీస్ స్కాలర్‌షిప్పుల పేరుతో పథకాన్ని అందిస్తోంది. ఇప్పటి వరకు 1,082 విద్యార్థులకు 178.52 కోట్ల రూపాయలను ప్రభుత్వం మంజూరు చేసింది.

100. నాయి బ్రాహ్మణుల సెలూన్లకు ప్రభుత్వం రాయితీతో విద్యుత్తును అందిస్తోంది. రాబోయే రెండు సంవత్సరాల్లో నాయి బ్రాహ్మణులు ఆధునిక సెలూన్ల ఏర్పాటు చేసుకోవడానికి ఆర్థిక సహాయం చేయాలని నిర్ణయించింది. రజకుల కోసం అధునాతన వసతులతో దోబీఘాట్లను నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

**కల్లు గీత కార్మికుల సంక్షేమం:**

101. గీత కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం నీరా పాలసీని తీసుకవచ్చింది. దీని కోసం ఈ బడ్జెట్ లో రూ.25 కోట్లు ప్రతిపాదిస్తున్నాము. అంతేకాక హరితహారం లో భాగంగా తాటి, ఈత వనాల పెంపకం చేపడుతున్నాము. ప్రమాదవశాత్తు చనిపోయిన గీత కార్మికుల కుటుంబాలకు ప్రభుత్వం ఆరు లక్షల రూపాయల ఎక్స్ గ్రేషియాను అందిస్తున్నది.

**గొల్ల కుర్మల సంక్షేమం- గొర్రెల పంపిణీ:**

102. మాంసోత్పత్తిలో తెలంగాణ స్వయం సమృద్ధి సాధించేందుకు, గొల్ల కుర్మల జీవన ప్రమాణాలు పెంచేందుకు తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున గొర్రెల పంపిణీ చేపట్టింది. ఇప్పటి వరకు 4,584 కోట్ల రూపాయలతో 77 లక్షల 2 వేల 737 గొర్రెలను, 3 లక్షల 66 వేల 797 మంది లబ్దిదారులకు పంపిణీ చేసింది. ఈ గొర్రెలకు బీమా సౌకర్యాన్ని కూడా కల్పించింది. పంపిణీ చేసిన గొర్రెల ద్వారా అదనంగా కోటి 20 లక్షల గొర్రె పిల్లలు పునరుత్పత్తి అయ్యాయి. దీని వల్ల రాష్ట్రంలో గొల్ల కురుమలకు 5,400 కోట్ల రూపాయల విలువ చేసే సంపద సమకూరింది.

103. వచ్చే ఆర్థిక సంవత్సరంలో గొల్ల కుర్మలకు 3,000 కోట్ల రూపాయలతో మరో మూడు లక్షల యూనిట్లను అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

**మత్స్యకారుల సంక్షేమం:**

104. మిషన్ కాకతీయ ఇచ్చిన సత్ఫలితాలతో పాటు కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా వస్తున్న జలాలతో రాష్ట్రంలోని చెరువులలో జల సిరి ఉట్టిపడుతోంది. ఇవి చేపల పెంపకానికి అద్భుతమైన వనరులుగా మారాయి. రాష్ట్ర ప్రభుత్వం చెరువులతో పాటు వివిధ జలాశయాల్లో భారీ సంఖ్యలో చేపపిల్లలను, రొయ్యలను వదులుతోంది. పెరిగిన చేప పిల్లలను పట్టుకుని అమ్ముకునే అవకాశం మత్స్యకారులకే ఇచ్చింది. చేపల, రొయ్యల ఉత్పత్తి ఇబ్బడి ముబ్బడిగా పెరిగిపోవడంతో మత్స్య కారులకు ఉపాధితో పాటు మంచి ఆదాయం లభిస్తోంది. మంచి నీటిలో పెరిగిన తెలంగాణ చేపలకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఏర్పడింది.

105. రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో నేడు మత్స్యపరిశ్రమ వాటా 0.5 శాతం. రాష్ట్రం ఏర్పడే నాటికి 2 లక్షల 49 వేల 633 టన్నుల చేపల ఉత్పత్తి జరిగేది. ఆనాటి ఉత్పత్తి విలువ 2,479 కోట్ల రూపాయలు.

తెలంగాణ ప్రభుత్వం 18,335 జలాశయాల్లో 268.37 కోట్ల చేపపిల్లలను, 11.64 కోట్ల రొయ్య పిల్లలను వదిలింది. దీనివల్ల ఒక సంవత్సరంలో 3 లక్షల 10 వేల టన్నుల చేపల ఉత్పత్తి జరిగిందంటే ప్రభుత్వం చేపల ఉత్పత్తిని ఏ స్థాయిలో పెంచిందో అర్థం చేసుకోవచ్చు. ఈ రోజు రాష్ట్రంలో ఉత్పత్తి అవుతున్న చేపల విలువ సుమారు 4,670 కోట్ల రూపాయలు. ఇది 2014 తో పోలిస్తే 88 శాతం అదనంగా పెరిగిన సంపద.

చేనేత కార్మికుల సంక్షేమం:

106. తెలంగాణ రాష్ట్రంలో నేత కార్మికులు గుండె మీద చేయి వేసుకుని హాయిగా జీవించగలుగుతున్నారు. సమైక్య రాష్ట్రంలో ఆత్మహత్యలు చేసుకున్న దుస్థితి నుంచి నేతన్నలను తెలంగాణ ప్రభుత్వం బయటపడేసింది. చేనేత కార్మికుల రుణాలను ప్రభుత్వం మాఫీ చేసింది. నేత పనికి కావల్సిన నూలు, రసాయనాలను సగం ధరకే అందజేస్తోంది. 95.25 లక్షల బతుకమ్మ చీరల ఆర్డర్లను, స్కూల్ యూనిఫాంల ఆర్డర్లను అందించి సుమారు 20,000 మంది నేత కార్మికులకు ప్రత్యక్షంగా ఉపాధి కల్పిస్తోంది. దీనిద్వారా 461 కోట్ల ఆర్డర్లు నేత రంగానికి వచ్చాయి. ప్రభుత్వం తెలంగాణ చేనేత కళాకృతులకు బ్రాండ్ వాల్యూ సృష్టిస్తూ మార్కెటింగ్ సదుపాయలను

మెరుగుపరుస్తోంది. పవర్ లూమ్ కార్మికుల ఆదాయం నెలనెలా 16 వేల రూపాయల నుంచి 20 వేల రూపాయలకు పెరిగింది. నేతన్నకు చేయూత పథకం కింద తమ నెల జీతంలో ఎనిమిది శాతం నేత కార్మికులు పొదుపు చేస్తే ప్రభుత్వం మరో ఎనిమిది శాతం జమ చేస్తోంది. ఇలా మూడు సంవత్సరాలపాటు పొదుపు చేసిన తర్వాత ఆ మొత్తాన్ని నేత కార్మికుడు బ్యాంకు నుంచి డ్రా చేసుకోవచ్చు. అయితే, కరోనా నేపథ్యంలో మూడు సంవత్సరాలకు ముందే 96 కోట్ల 43 లక్షల పొదుపు మొత్తాన్ని విడుదల చేసి నేత కార్మికులను ఆదుకున్నది.

107. తెలంగాణ ప్రభుత్వం ఈ సంవత్సరం బడ్జెట్‌లో నేతన్నల సంక్షేమం కోసం రూ.338 కోట్లు ప్రతిపాదిస్తున్నది.

108. కళ్యాణ లక్ష్మిలో బీసీ సామాజిక వర్గానికి చెందిన దరఖాస్తుదారుల సంఖ్య ఎక్కువగా ఉంది. ఆ సంఖ్యకు అనుగుణంగా ఈ సంవత్సరం బడ్జెట్‌లో అదనంగా 500 కోట్ల రూపాయలను ప్రతిపాదిస్తున్నాం. మొత్తంగా 1850 కోట్ల రూపాయలను ప్రతిపాదిస్తున్నాం.

109. తెలంగాణ ప్రభుత్వం ఈ సంవత్సరం బీసీ కార్పోరేషన్ మరియు అత్యంత వెనుకబడిన తరగతుల కార్పోరేషన్ కు బడ్జెట్లో 1,000 కోట్ల రూపాయలను ప్రభుత్వం ప్రతిపాదిస్తున్నది.

110. బీసీ సంక్షేమ శాఖకు ఈ బడ్జెట్‌లో 5,522 కోట్ల రూపాయలను ప్రతిపాదించడమైనది.

మైనారిటీల సంక్షేమం:

111. ప్రభుత్వ సంక్షేమ పథకాలలో ఎస్సీలతో సరిసమానంగా మైనార్టీలకు ప్రయోజనాలు వర్తింపజేయాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది.

112. విద్యారంగంలో మైనార్టీలు ముందడుగు వేయడం కోసం ప్రత్యేకంగా మైనార్టీ గురుకులాలను ఏర్పాటు చేసింది. ముఖ్యంగా మైనార్టీ బాలికలు బాగా చదువుకోవడం ద్వారా తమ కాళ్లపై తాము నిలబడాలని 50 శాతం గురుకులాలను మైనార్టీ బాలికల కోసమే ఏర్పాటు చేసింది. రాష్ట్రం ఏర్పడే నాటికి కేవలం 12 మైనార్టీ గురుకులాలు అరకొర వసతులతో నడస్తూ ఉండేవి. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మైనార్టీ గురుకులాల సంఖ్యను 204కు పెంచి అన్ని వసతులు కల్పించింది. ఈ ఆర్థిక సంవత్సరంలో

గురుకులాల నిర్వహణకు 561 కోట్ల రూపాయలను కేటాయించాం. ఇందులో లక్ష మంది మైనార్టీ విద్యార్థులు మంచి చదువులు చదువుకుంటున్నారు.

113. ప్రతిష్టాత్మకమైన విద్యాసంస్థ జామే నిజామియాలో 15 కోట్ల రూపాయలతో అధునాతన హంగులతో విశాలమైన ఆడిటోరియాన్ని ప్రభుత్వం నిర్మించింది.

114. ఇస్లామిక్ కల్చరల్, కన్వెన్షన్ సెంటర్ నిర్మాణం కోసం నగరంలోని కోకాపేటలో 10 ఎకరాల స్థలాన్ని ప్రభుత్వం కేటాయించింది. త్వరలో నిర్మాణ పనులు ప్రారంభమవుతాయి.

115. సివిల్ సర్వీసెస్ పరీక్షలకు సిద్ధం కావాలనుకునే 100 మంది మైనారిటీ విద్యార్థులకు ఉన్నత స్థాయి శిక్షణను వారు కోరుకున్న చోట, కోరుకున్న విద్యాసంస్థలో ప్రభుత్వం అందిస్తోంది.

116. విదేశాలలో విద్య అభ్యసించాలనుకునే 1,684 మంది మైనార్టీ విద్యార్థులకు 294 కోట్ల రూపాయలను ఓవర్సీస్ స్కాలర్‌షిప్పు పథకం కింద మంజూరు చేసింది.

117. 54 మైనార్టీ రెసిడెన్షియల్ స్కూళ్లకు 1,054 కోట్ల రూపాయలతో పక్కా భవనాల నిర్మాణం జరుగుతోంది.

118. రంజాన్, క్రిస్మస్ లను రాష్ట్ర పండుగలుగా ప్రభుత్వ ఖర్చుతో ఘనంగా నిర్వహిస్తోంది. ఈ సందర్భంగా ఏడు లక్షల మంది పేద ముస్లిం, క్రైస్తవులకు ప్రభుత్వం నూతన వస్త్రాలను పంపిణీ చేసింది. పండుగల సందర్భంగా సామూహిక విందులు ఏర్పాటు చేసి వారి సంతోషంలో పాలుపంచుకొంటున్నాము.

119. మైనారిటి డెవలప్‌మెంటు కార్పోరేషన్ ద్వారా మైనార్టీ వర్గాలవారికి ప్రత్యేకమైన అండదండలు అందిస్తున్నాం. మైనారిటీ యువతకు స్వయం ఉపాధి రుణాల్లో సబ్సిడీని అందచేస్తున్నాం. షాదీముబారక్ పథకం కింద 1 లక్ష 75 వేల 924 మంది లబ్ధిపొందారు. దీనికి 1,341 కోట్ల రూపాయలను ఇప్పటివరకు ఖర్చు చేయడం జరిగింది.

120. మైనార్టీ సంక్షేమానికి 2008 నుంచి 2014 మధ్యకాలంలో 812 కోట్ల రూపాయలు ఖర్చు చేస్తే, గడచిన ఆరేళ్లలో తెలంగాణ ప్రభుత్వం 5,712 కోట్ల రూపాయలను ఖర్చు చేసింది.

121. ఈ బడ్జెట్‌లో మైనార్టీ సంక్షేమానికి 1,606 కోట్ల రూపాయలను ప్రభుత్వం ప్రతిపాదిస్తున్నది.

## గల్ఫ్ కార్మికుల సంక్షేమం:

122. తెలంగాణ ప్రాంతం నుంచి బతుకుదెరువు కోసం గల్ఫ్ దేశాల్లో ఉన్న తెలంగాణ కార్మికులను సానుభూతితో ఆదుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందు కోసం కేరళ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాన్ని అధ్యయనం చేయడానికి ప్రత్యేక బృందం పర్యటించి వచ్చింది. ఆ బృందం ఇచ్చే నివేదిక ఆధారంగా రాబోయే రోజుల్లో గల్ఫ్ కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది.

## మహిళా శిశు సంక్షేమం:

123. మహిళల ఆరోగ్యం, భద్రతతో పాటు వారి విద్యా వికాసాలకు కూడా ప్రభుత్వం సమాన ప్రాధాన్యాన్ని ఇస్తోంది.

124. గర్భిణులకు పూర్తి విశ్రాంతి అవసరం. ఆ దశలోను పని చేసే అగత్యాన్ని ఏ స్త్రీ ఎదుర్కోకూడదు. అది గర్భిణికి మాత్రమే కాకుండా గర్భస్థ శిశువుకూ ప్రమాదకరం. మానవీయతకు మారుపేరయిన కేసీఆర్ గారు గర్భిణీ స్త్రీ పని చేయలేక కోల్పోయే వేతనాన్ని ప్రభుత్వమే చెల్లించాలని నిర్ణయించారు. కేసీఆర్ కిట్ పథకాన్ని ప్రవేశపెట్టారు. గర్భదారణ నుంచి ప్రసవం జరిగే వరకు మూడు దశల్లో 4 వేల చొప్పున, మొత్తం 12 వేల రూపాయలను

ప్రభుత్వం గర్భిణులకు చెల్లిస్తోంది. పుట్టింది ఆడ శిశువు అయితే అదనంగా మరో వేయి రూపాయలు చేర్చి 13 వేల రూపాయలు అందజేస్తోంది. ఈ పథకం వల్ల ఆసుపత్రి ప్రసవాలు పెరిగాయి. బాలింత, శిశు మరణాల సంఖ్య చాలా వరకు తగ్గింది. ప్రసూతి తర్వాత తల్లికీ, పిల్లకు ఉపయోగపడేలా 15 వస్తువులతో కేసీఆర్ కిట్ ను ప్రభుత్వం అందజేస్తోంది.

125. పేద మహిళలకు, శిశువులకు కేసీఆర్ కిట్ ఒక గొప్ప కానుకగా నిలిచింది. 8 లక్షల 71 వేల 340 మందికి కేసీఆర్ కిట్స్ పంపిణీ చేశాం. ఈ పథకం ఆదర్శంగా తీసుకుని వివిధ పేర్లతో చాలా రాష్ట్రాలు అమలు చేస్తున్నాయి.

126. ప్రసూతి మరణాలు 2013-14లో లక్ష మందికి 92 ఉంటే నేడు అది 63 కు తగ్గింది. శిశు మరణాల రేటు 39 నుంచి 26 కు తగ్గింది. బాలింతలు, శిశు మరణాల రేటును గణనీయంగా తగ్గించడంలో తెలంగాణ రాష్ట్రం ప్రథమ స్థానంలో నిలిచిందని నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే పేర్కొంది. ఇది ఆరోగ్య లక్ష్మి, కేసీఆర్ కిట్ పథకాలు సాధించిన గొప్ప ఫలితం.

127. బతుకమ్మ పండుగ సందర్భంగా కోటి మంది తెలంగాణ ఆడబిడ్డలకు బతుకమ్మ చీరలను రాష్ట్ర కానుకగా ప్రభుత్వం అందిస్తోంది. ఇందు కోసం 338 కోట్ల రూపాయలను ప్రతీ ఏటా ఖర్చు పెడుతోంది.

128. మహిళా కమిషన్‌కు తొలి అధ్యక్షురాలిగా మాజీ మంత్రి శ్రీమతి సునీతా లక్ష్మారెడ్డి గారిని ఇటీవలనే ప్రభుత్వం నియమించింది. పోలీసు నియామకాల్లో కూడా మహిళలకు 33 శాతం రిజర్వేషన్‌ను నిక్కచ్చిగా అమలు చేస్తున్నది. మహిళల భద్రత కోసం ఏర్పాటయిన షీ టీం దళాలు చురుగ్గా పనిచేస్తున్నాయి. మహిళా స్వయం ఉపాధిని ప్రోత్సహించడానికి షీక్యాబ్ పథకాన్ని ప్రభుత్వం తీసుకువచ్చింది. ఈ పథకం కింద కార్ల కొనుగోలుకు 35 శాతం రాయితీ ఇస్తోంది. పట్టణాల్లో నగరాల్లో టాయిలెట్లు లేక మహిళలు పడుతున్న ఇబ్బందులను ప్రభుత్వం తీవ్రంగా పరిగణించింది. సమస్య పరిష్కారానికి మహిళల కోసం ప్రత్యేకంగా రాష్ట్ర వ్యాప్తంగా 7,010 షీ టాయిలెట్లను యుద్ధ ప్రాతిపదికన నిర్మించింది. రాష్ట్రంలోని అన్ని పోలీసుస్టేషన్లలో మహిళలకు ప్రత్యేకంగా టాయిలెట్లను నిర్మించాలని తలపెట్టింది. మహిళా పోలీసు అధికారులు, సందర్శకులు, మహిళా నేరస్థులు ఇబ్బంది పడకుండా పోలీస్ స్టేషన్లలో షీ టాయిలెట్ల నిర్మాణానికి

20 కోట్ల రూపాయలు ఈ బడ్జెట్‌లో ప్రభుత్వం ప్రతిపాదిస్తున్నది. అదే రీతిలో మహిళా ప్రొఫెసర్లు, సిబ్బంది, విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని యూనివర్సిటీలలో షి టాయిలెట్లు నిర్మించేందుకు ప్రభుత్వం 10 కోట్ల రూపాయలను ఈ బడ్జెట్‌లో ప్రతిపాదిస్తున్నాము.

129. ప్రభుత్వం ఇచ్చే డబుల్ బెడ్ రూం ఇళ్లను మహిళల పేరు మీదే అందిస్తోంది.

130. ఆరోగ్య లక్ష్మి పథకం కింద ఇప్పటి వరకు 136.44 కోట్ల రూపాయలు వెచ్చించి నాలుగు లక్షల మంది గర్భిణీ స్త్రీలకు చక్కటి పౌష్టికాహారాన్ని అందిస్తున్నది.

131. రాష్ట్రంలోని అయిదు జిల్లాల్లో మహిళలు రక్తహీనతతో మరియు కొంత మంది పిల్లలు శారీరక బలహీనతకు గురి అవుతున్నారని నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే పేర్కొన్నది. ఇదే సమస్యను ఇతర రాష్ట్రాలు పరిష్కరించిన తీరును అధ్యయనం చేయడానికి 9 మంది ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ ఉన్నతాధికారులతో కూడిన బృందాన్ని ఏర్పాటు చేసింది. ఈ బృందం కేరళ తదితర రాష్ట్రాలను పర్యటించి వచ్చి పరిష్కారాలను సూచిస్తూ సమగ్ర నివేదిక

ఇచ్చింది. వారి సూచనల ఆధారంగా మహిళలో రక్తహీనత సమస్య నివారణ కోసం కావాల్సిన చర్యలు ప్రభుత్వం తీసుకుంటుంది.

**మహిళా సంఘాలకు చేయూత:**

132. తెలంగాణ ప్రభుత్వ సహకారంతో మహిళా స్వయం సహాయక సంఘాలు ఎంతో వృద్ధి చెందుతున్నాయి. ఈ సంఘాల ద్వారా మహిళల్లో పొదుపు చైతన్యం పెరుగుతోంది. రాష్ట్రంలో మొత్తం 4 లక్షల 29 వేల 262 స్వయం సహాయక సంఘాలు ఉన్నాయి. వాటిలో 46 లక్షల 65 వేల 443 మంది మహిళలు సభ్యులుగా ఉన్నారు. వీరందరు పొదుపు చేసుకుంటూ బ్యాంకుల ద్వారా వడ్డీలేని రుణాలను పొందుతున్నారు. క్రమం తప్పకుండా తిరిగి చెల్లిస్తున్నారు. రాష్ట్రంలో మహిళా సంఘాల సభ్యులందరికీ 2020-21 సంవత్సరంలో, వడ్డీలేని రుణాల రూపంలో మొత్తం 9 వేల 803 కోట్ల రూపాయలను బ్యాంకులు అందించాయి. రుణాల రికవరీ రేటు 97.25 శాతంగా ఉన్నది. ఈ ఆర్థిక సంవత్సరంలో మహిళా స్వయం సహాయక సంఘాలకు వడ్డీలేని రుణాల కోసం 3 వేల కోట్ల రూపాయల భారీ మొత్తాన్ని ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది.

133. రాష్ట్రం ఏర్పడిన తర్వాత మహిళా విద్యావికాసానికి పెద్ద ఎత్తున రెసిడెన్షియల్ స్కూళ్లు, కాలేజీలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది.

134. ఈ ఆర్థిక సంవత్సరంలో మహిళా శిశు సంక్షేమం కోసం బడ్జెట్ లో ప్రభుత్వం 1,702 కోట్ల నిధులను ప్రతిపాదిస్తున్నాము.

**డబుల్ బెడ్ రూం ఇండ్ల పథకం:**

135. పేదలకు గౌరవ ప్రదమైన నివాసాన్ని ఉచితంగా అందించాలనే ముఖ్యమంత్రి గారి ఆశయానికి ప్రతిరూపం డబుల్ బెడ్ రూం ఇళ్ల పథకం. ఈ ఆర్థిక సంవత్సరంలో డబుల్ బెడ్ రూం ఇండ్ల కోసం 11 వేల కోట్ల రూపాయలను ప్రతిపాదిస్తున్నాము. ఇప్పటివరకు రాష్ట్రంలో గ్రామీణ, పట్టణ ప్రాంతాలకు కలిపి 52,456 డబుల్ బెడ్ రూంల నిర్మాణం పూర్తి అయింది. మిగతా గృహాల నిర్మాణం చివరి దశకు చేరుకున్నది. త్వరలోనే వీటిని లబ్దిదారులకు అందచేస్తాము. గత బడ్జెట్‌లో, సొంత స్థలం కలిగిన పేదలకు రెండు పడకగదుల గృహం నిర్మించుకోవడం కోసం ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తుందని తెలిపాము. కానీ, కరోనా ఆర్థిక సంక్షోభం వల్ల ఈ హామీ అమలు వాయిదా పడింది. ఆర్థిక వ్యవస్థ కొద్దిగా పుంజుకుంటున్న ప్రస్తుత

పరిస్థితుల్లో ఈ సంవత్సరం ఆ హామీని అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీని విధి విధానాలను త్వరలోనే ప్రభుత్వం విడుదల చేస్తుంది.

పట్టణ ప్రగతి:

136. పల్లె ప్రగతి స్ఫూర్తితో ప్రభుత్వం పట్టణ ప్రగతికి శ్రీకారం చుట్టింది. నేడు తెలంగాణలో పట్టణీకరణ వేగంగా జరుగుతుంది. దానికి అనుగుణంగా సౌకర్యాలు పెరగాల్సిన అవసరాన్ని ప్రభుత్వం గుర్తించింది. నూతన మున్సిపాలిటీ చట్టం ద్వారా ప్రజా ప్రతినిధులకు అధికారాలు, బాధ్యతలని స్పష్టంగా నిర్దేశించింది. పారదర్శకంగా పట్టణ పరిపాలన సాగే విధంగా చట్టాలు నిబంధనలు పొందుపరిచింది. మున్సిపాలిటీల్లో ఎక్కడ చూసిన మురుగు కాల్వల పక్కన చేపల అమ్మకం, ఫుట్‌పాత్‌ల పైన కూరగాయల అమ్మకాలు జరగడం చూస్తాం. గజ్వేల్‌లో ఒక మోడల్ మార్కెట్‌ను ఇప్పటికే నిర్మించాం. దీని స్ఫూర్తితో రాష్ట్రంలోని అన్ని పట్టణాల్లో ఇటువంటివి ఏర్పాటు చేయనున్నాం. ఈ పరిస్థితులను సమూలంగా మార్చివేసేందుకు సమీకృత వెజ్-నాన్‌వెజ్ మార్కెట్లను ప్రతీ పట్టణంలో నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు గాను ఈ బడ్జెట్ లో 500 కోట్ల నిధులను ప్రభుత్వం ప్రతిపాదిస్తుంది. ప్రజల సౌకర్యం కోసం విరివిగా

పబ్లిక్ టాయిలెట్లను ప్రభుత్వం నిర్మిస్తుంది. తగిన సంఖ్యలో టాయిలెట్లు లేక ప్రజలు పడే పాట్లు అంతా ఇంతా కావు. పట్టణ ప్రగతి కార్యక్రమాన్ని చేపట్టక ముందు, రాష్ట్రంలో 4,804 పబ్లిక్ టాయిలెట్లు మాత్రమే అందుబాటులో ఉండేవి. ఈ ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రంలోని కొత్తగా 9,216 పబ్లిక్ టాయిలెట్లను ప్రభుత్వం నిర్మించింది. వీటితో ఇప్పుడు పట్టణ ప్రగతిలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపాలిటీలు, జీహెచ్ఎంసీ సహా అన్ని కార్పొరేషన్లలో కలిపి ప్రభుత్వం 14,020 టాయిలెట్లను అందుబాటులోకి తెచ్చింది. ప్రతీ వెయ్యి మందికి ఒకటి చొప్పున వీటిని నిర్మించాం. అవసరాన్ని బట్టి మరిన్ని నిర్మిస్తాం.

137. తుది శ్వాస విడిచిన వారి అంత్యక్రియలు, కర్మకాండలు జరుపుకోవడానికి కావల్సిన అన్ని వసతులతో గ్రామాల్లో నిర్మిస్తున్న వైకుంఠధామాలు పూర్తికావొస్తున్నాయి.

138. ఇదే తరహాలో పట్టణాల్లో కూడా ఆధునిక సౌకర్యాలతో వైకుంఠధామాల నిర్మాణానికి 200 కోట్ల నిధులను ఈ బడ్జెట్ లో ప్రభుత్వం ప్రతిపాదిస్తుంది.

139. ప్రతీ నెలా పట్టణ ప్రగతి కోసం క్రమం తప్పకుండా 148 కోట్ల రూపాయలు ప్రభుత్వం మంజూరు చేస్తోంది. నిధుల కొరత సమస్య రానివ్వకుండా చూస్తోంది.

హైదరాబాద్ నగర అభివృద్ధి:

140. తెలంగాణ ఏర్పడిన తర్వాత హైదరాబాద్ నగర అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రత్యేకమైన ప్రణాళికలు రచించి అమలు చేస్తోంది. ఈ చర్యల ఫలితంగా సామాజిక, ఆర్థిక, స్థిరాస్థి వ్యాపార, ఉపాధి దాయక అంశాల ప్రాతిపదికన ప్రతీ ఏటా జరిగే ప్రపంచ స్థాయి అధ్యయనాల్లో మన హైదరాబాద్ రెండవసారి అగ్రగామిగా నిలిచింది. నగరంలో 9 ఫ్లై ఓవర్లు, 4 అండర్ పాస్‌లు, 3 ఆర్వోబిల నిర్మాణం పూర్తి చేసుకున్నాం. కరోనా సమయంలో 2 వేల కోట్ల రూపాయల విలువైన ఫ్లై ఓవర్లు, 300 కిలోమీటర్ల రోడ్లు, 29 లింకురోడ్ల నిర్మాణం పూర్తయింది.

141. ప్రభుత్వం ఇటీవలనే పూర్తి చేసిన దుర్గం చెరువు కేబుల్ బ్రిడ్జి నగరానికి కొత్త అందాన్ని తెచ్చిపెట్టింది. ఈ బ్రిడ్జి సౌందర్యాన్ని చూసేందుకు రోజు వేలాది మంది పర్యాటకులు తరలి వస్తున్నారు. ఈ బ్రిడ్జి వల్ల బంజారాహిల్స్ నుంచి హైటెక్ సిటీ మధ్య దూరం చాలా

తగ్గింది. ట్రాఫిక్ ఇబ్బందులు తొలిగి వాహన దారులు సౌకర్యవంతంగా, వేగంగా ప్రయాణించ గలుగుతున్నారు.

142. పేదల ఆకలి తీర్చేందుకు ప్రభుత్వం నగరంలో 179 అన్నపూర్ణ సెంటర్ల ద్వారా ప్రతీ రోజు 55 వేల మందికి ఐదు రూపాయలకే చక్కటి భోజనం అందిస్తోంది.

143. ఇటీవల జీహెచ్ఎంసీ ఎన్నికల సందర్భంగా నగరవాసులకు మంచి నీటిపై ఇచ్చిన హామీని ప్రభుత్వం నిలబెట్టుకుంది.

144. ప్రతీ కుటుంబానికి ప్రభుత్వం 20 వేల లీటర్ల సురక్షిత మంచి నీటిని ఉచితంగా అందిస్తోంది. దీనికి ఎలాంటి బిల్లు చెల్లించాల్సిన అవసరం లేదు. దీని వలన పేద మధ్యతరగతి ప్రజలపై వాటర్ బిల్లుల భారం తగ్గింది. ఉచిత మంచినీటి సరఫరా కోసం ఈ బడ్జెట్ లో 250 కోట్ల రూపాయలను ప్రభుత్వం ప్రతిపాదిస్తోంది.

145. హైదరాబాద్ ప్రజల భవిష్యత్తు తాగునీటి అవసరాలను దృష్టిలో పెట్టుకొని నాగార్జున సాగర్ సమీపంలోని సుంకిశాల నుంచి హైదరాబాద్‌కు నీటిని తరలించడానికి ప్రభుత్వం కొత్త ప్రాజెక్టును నిర్మించనుంది. దీని కోసం 1,450 కోట్ల నిధులు ఖర్చవుతాయని

అంచనా వేస్తోంది. ఈ బడ్జెట్‌లో సుంకిశాల వద్ద నిర్మించే తాగు నీటి ప్రాజెక్టు కోసం 725 కోట్ల నిధులను ప్రభుత్వం ప్రతిపాదిస్తోంది.

146. మూసీ నది పునరుజ్జీవనం కోసం, మూసీ పరిసరాల సుందరీకరణ కోసం ఈ బడ్జెట్ లో 200 కోట్ల నిధులను ప్రభుత్వం ప్రతిపాదిస్తోంది.

147. మెట్రో రైలు ప్రాజెక్టు కోసం ఈ బడ్జెట్ లో 1,000 కోట్ల రూపాయలను ప్రతిపాదిస్తున్నది.

148. ఔటర్ రింగ్ రోడ్డు పరిధి లోపల కొత్తగా ఏర్పడిన కాలనీలకు తాగు నీటి సరఫరా కోసం 250 కోట్ల నిధులను ప్రతిపాదిస్తున్నాం.

149. వరంగల్ కార్పోరేషన్ లో వివిధ అభివృద్ధి పనుల కోసం 250 కోట్ల రూపాయలు, ఖమ్మం కార్పోరేషన్‌కు 150 కోట్ల రూపాయలను ప్రభుత్వం ప్రతిపాదిస్తోంది.

150. ఈ బడ్జెట్లో పురపాలక మరియు పట్టణాభివృద్ధి శాఖకు మొత్తం రూ.15,030 కోట్లు ప్రతిపాదిస్తున్నాం.

**కరోనా కట్టడికి చర్యలు :**

151. కరోనా వ్యాప్తిని అరికట్టడానికి ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా 1,200 కరోనా పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసింది. ప్రతీ పది లక్షల జనాభాలో 2 లక్షల 11 వేల జనాభాకి కరోనా పరీక్షలు నిర్వహించింది. ఐసోలేషన్ సెంటర్లు మందులు, బెడ్లు, ఆహారం మొదలగు అవసరాల కోసం 1,178.28 కోట్ల రూపాయలను ఖర్చు చేసింది.

152. కరోనా సమయంలో రాష్ట్రంలోని పేద ప్రజలకు, వలస కూలీలకు ప్రభుత్వం అండగా నిలిచింది. ఉన్నతమైన మానవీయ కోణాన్ని ఆవిష్కరించింది. లాక్‌డౌన్ మొదలైన మొదటి మూడు నెలలు, ప్రతి వ్యక్తికి ఉచితంగా 12 కిలోల రేషన్ బియ్యం అందించింది. ఆ తర్వాత కూడా 5 నెలలు పాటు 10 కిలోల బియ్యం ఉచితంగా అందించింది. రేషన్ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి రెండు నెలల పాటు 1,500 రూపాయల ఆర్థిక సహాయాన్ని నేరుగా వారి ఖాతాలో జమ చేసింది. దీనికి గాను 2,455 కోట్ల రూపాయలు ఖర్చు చేసింది.

153. వివిధ రాష్ట్రాల నుండి బతుకు తెరువు కోసం తెలంగాణకు వచ్చిన వలస కార్మికులను కూడా విస్మరించలేదు. వారిని కడుపులో పెట్టుకుని కాపాడుకున్నది. 6 లక్షల 47 వేల వలస కార్మికులకు 500

రూపాయలతో పాటు 5 కిలోల బియ్యం ఉచితంగా అందజేసింది. దీనికి గాను 107 కోట్ల రూపాయలను ఖర్చు చేసింది.

154. ముఖ్యమంత్రి గారు వలస కార్మికులు కూడా తెలంగాణ అభివృద్ధిలో భాగస్వామ్యులే అని అంటూ కరోనా కష్టకాలంలో 2,01,213 మంది వలస కార్మికులను వారి స్వస్థలాలకు పంపేందుకు కేంద్రంతో మాట్లాడి ప్రత్యేకంగా 151 శ్రామిక్ రైళ్లను ఏర్పాటు చేశారు. దీనికి గాను రాష్ట్ర ప్రభుత్వం 17 కోట్ల రూపాయలు వెచ్చించింది.

155. కరోనా పై అలుపెరుగని పోరాటం చేస్తున్న పోలీసులు, వైద్యులు, పారిశుద్ధ్య కార్మికులకు ప్రోత్సాహకంగా 235 కోట్ల 36 లక్షల రూపాయలను ఇచ్చింది. కరోనా బారిన పడిన జర్నలిస్టులకు ఆర్థిక సహాయం అందించింది. న్యాయవాదులకు కరోనా సమయంలో 25 కోట్ల రూపాయలను ఆర్థిక సహాయం అందించింది.

156. కరోనా కష్టకాలంలో ప్రజాసేవలో నిమగ్నమైన ఫ్రంట్‌లైన్ వారియర్స్ వైద్య సిబ్బంది, పోలీసు, పారిశుద్ధ్య సిబ్బంది, ఆయా శాఖల అధికారులు తదితరులందరికీ ప్రభుత్వ పక్షాన ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. నిత్యం ప్రజల మధ్య ఉండి మనోధైర్యం కల్పించిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, కార్పొరేటర్లు, సర్పంచులు ఇతర

ప్రజాప్రతినిధులందరికీ అభినందనలు తెలియజేస్తున్నాను. ఏ కష్టం వచ్చినా మనమంతా ఒక్కటేనన్న తెలంగాణ స్ఫూర్తిని ఇదే విధంగా ఎల్లవేళలా కొనసాగిద్దాం.

**వైద్యం – ఆరోగ్యం:**

**157.** ప్రజా ఆరోగ్య వైద్య వ్యవస్థ మీద ప్రజల్లో ఉన్న అపనమ్మకాన్ని తొలగించి నూతన విశ్వాసాన్ని తెలంగాణ ప్రభుత్వం కలిగించింది. ఆరోగ్య తెలంగాణ లక్ష్యంగా వైద్య రంగంలో అనేక సంస్కరణలు ప్రవేశపెట్టింది. రాష్ట్రం ఏర్పడే నాటికి తెలంగాణలో ఒక్క డయాగ్నస్టిక్ సెంటర్ కూడా లేదు. తెలంగాణ ప్రభుత్వ హయాంలో పేద ప్రజల కోసం ప్రత్యేకంగా 25 డయాగ్నస్టిక్ సెంటర్లు ఏర్పాటయ్యాయి. 2014 నాటికి రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ రంగంలో కేవలం మూడు డయాలసిస్ సెంటర్లు మాత్రమే ఉండేవి. తెలంగాణ ప్రభుత్వం 2020-21 నాటికి 49 డయాలసిస్ సెంటర్లను ఏర్పాటు చేసింది. ఇందులో ఇప్పటి వరకు సగటున ఏడాదికి 10,500 మంది చికిత్స పొందుతున్నారు. తెలంగాణ ప్రభుత్వం నూతనంగా 22 వైరాలజీ ల్యాబులను ఏర్పాటు చేసింది.

158. కరోనా సమయంలో పేషంట్ల సంఖ్య పెరిగిపోతుండడంతో ప్రభుత్వం తక్షణమే పూనుకొని గచ్చిబౌలిలో తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(టిమ్స్)ను యుద్ధ ప్రాతిదికన ఏర్పాటు చేసింది. కావాల్సిన బెడ్లు, ఆక్సీజన్ సదుపాయాలను త్వరితగతిన సిద్ధం చేసింది.

బస్తీ దవాఖానాలు:

159. గడిచిన యాభై సంవత్సరాలలో బస్తీ వాసుల స్థితి గతులను చూసిన దిక్కే లేదు. బస్తీ ప్రజలు అనారోగ్యానికి గురైతే సమీపంలో వైద్య వసతి కల్పించాలనే ఆలోచన గత ప్రభుత్వాలు చేయలేదు. చిన్నపాటి అనారోగ్యం కలిగినా కార్పోరేటు ఆసుపత్రులకు పరుగెత్తి పేద ప్రజలు జేబులు గుల్ల చేసుకోకుండా వైద్యాన్ని బస్తీల చెంతకు చేర్చాలనే ఆలోచనతో ప్రభుత్వం బస్తీ దవాఖానాలను ప్రారంభించింది. బస్తీ దవాఖానాల ద్వారా నాణ్యమైన వైద్యసేవలను పేద ప్రజల వద్దకు తీసుకువచ్చింది. ఇప్పటి వరకు 224 బస్తీ దవాఖానాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అందులో 196 రకాల మందులను అందుబాటులో ఉంచింది. 56 రకాల వైద్య పరీక్షలని నిర్వహిస్తోంది.

160. ఈ బడ్జెట్ లో వైద్య ఆరోగ్య శాఖ కోసం 6,295 కోట్ల రూపాయలను ప్రతిపాదిస్తుంది.

విద్యారంగం:

161. స్వామి వివేకానంద పేర్కొన్నట్లు వ్యక్తికి స్వావలంబన చేకూర్చేదే నిజమైన విద్య. తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలో విద్యారంగ పునాదులను పటిష్టపరిచింది. ఉత్తమ విద్య అందని ద్రాక్షగా మారిన పేద, వెనుకబడిన వర్గాలకు అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్యను ఉచితంగా అందిస్తోంది. కార్పోరేట్ విద్యాసంస్థలను తలదన్నే విధంగా ఏర్పాటయిన గురుకులాల్లో తమ పిల్లలు చదువుకోవాలని తల్లిదండ్రులు ఆరాటపడుతున్నారు. ప్రయివేటు స్కూళ్లలో విద్యార్థుల సంఖ్య తగ్గి, ప్రభుత్వ గురుకులాల్లో పెరిగింది. క్యాట్, మెడిసిన్, ఇంజనీరింగ్ విద్యలో జాతీయస్థాయిలో ఉత్తమ ర్యాంకులను మన రాష్ట్ర విద్యార్థులు సాధిస్తున్నారు. గురుకులాల్లో చదువుకున్న విద్యార్థులు విద్యా విషయాల్లోనే కాకుండా క్రీడా, సాంస్కృతిక రంగాల్లోనూ ప్రతిభా పాటవాలను ప్రదర్శిస్తున్నారు. 2014 లో ఉన్న మొత్తం గురుకులాలు 298 కాగా నేడు రాష్ట్రంలో ఉన్న గురుకులాల సంఖ్య 970 అంటే విద్యా రంగంలో సాధించిన ప్రగతిని అర్థం చేసుకోవచ్చు. ఒక్కో విద్యార్థిపై సాలీనా ప్రభుత్వం లక్ష రూపాయలను ఖర్చు చేస్తోంది. దేశంలో మరే

రాష్ట్రంలో లేని విధంగా, తెలంగాణలో, ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఎటువంటి ఫీజు లేకుండా విద్యను మరియు టెక్స్ట్ పుస్తకాలను ఉచితంగా అందిస్తున్నాము. దీనివలన ప్రతి సంవత్సరం 404 ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుకునే 1 లక్ష 80 వేల 750 మంది విద్యార్థులకు లబ్ధి జరుగుతోంది.

162. 2019-20 విద్యా సంవత్సరంలో అన్ని సామాజిక వర్గాల గురుకులాల్లో విద్య అభ్యసిస్తున్న విద్యార్థుల సంఖ్య 4 లక్షల 29 వేల 686.

విద్యా రంగం అభివృద్ధికి నూతన పథకం:

163. తెలంగాణలో విద్యారంగాన్ని సంపూర్ణంగా, సమగ్రంగా ఉన్నతీకరిస్తూ 4,000 కోట్ల రూపాయలతో సరికొత్త విద్యాపథకాన్ని ఈ బడ్జెట్ లో ప్రతిపాదిస్తున్నాం. రాబోయే రెండేళ్లలో రాష్ట్రంలోని అన్ని రకాల ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతుల నిర్మాణం పెద్ద ఎత్తున ప్రభుత్వం చేపట్టబోతోంది. పాఠశాలలకు అవసరమైన భవనాలు, వాటి మరమ్మతులు, కావాల్సిన ఫర్నిచర్, టాయిలెట్లు వంటి వసతులు కల్పించాలని నిర్ణయించింది. ఆధునిక సాంకేతిక విజ్ఞానంతో పాఠశాల తరగతులను అనుసంధానం చేస్తుంది.

164. ఈ బృహత్తర విద్యా పథకం కోసం ఈ సంవత్సరం 2,000 కోట్ల నిధులు ఖర్చుచేయనున్నాం.

165. పాఠశాల విద్యకి 11,735 కోట్ల రూపాయలను ప్రతిపాదిస్తున్నాము.

166. ఉన్నత విద్యారంగానికి 1,873 కోట్ల రూపాయలను కేటాయిస్తున్నాము.

విద్యుచ్ఛక్తి రంగం:

167. విద్యుత్తు రంగంలో తెలంగాణది ఒక విజయగాధ. 24 గంటల పాటు అన్ని రంగాలకు నిరంతరాయంగా విద్యుత్తు సరఫరా చేస్తోన్న ఓకే ఒక్క రాష్ట్రం తెలంగాణ. ఇది ప్రత్యర్థులు సైతం అంగీకరించిన విజయం. కాదనడానికి వీల్లేని వాస్తవం. మన గౌరవ ముఖ్యమంత్రిగారి అకుంఠిత దీక్ష, విద్యుత్తు సిబ్బంది నిరంతర శ్రమ, అధికారుల సమర్థ పర్యవేక్షణే ఈ విజయానికి కారణం.

168. తెలంగాణలో నేడు రికార్డు స్థాయిలో కరెంట్ డిమాండ్ పెరిగింది. అదే స్థాయిలో సమర్థవంతంగా కరెంట్ సరఫరా జరుగుతోంది.

169. కరెంటు కోతలు, క్రాప్ హాలిడేలు, పవర్ హాలిడేలు ఇక గతం. వాటికి ఇక తెలంగాణలో చోటు లేదు. వ్యవసాయ రంగంతో పాటు ఇతర రంగాలకు 24 గంటల విద్యుత్ నిరంతరాయంగా సరఫరా అవుతోంది.

170. రాష్ట్ర తలసరి విద్యుత్ వినియోగం 2014 నాటికి 1,110 యూనిట్లు ఉండగా 2020-21 నాటికి 2,071 యూనిట్లకు చేరుకున్నది. విద్యుత్ తలసరి వినియోగంలో తెలంగాణ దేశంలోనే అగ్రగామిగా ఉన్నది. ఇది రాష్ట్ర ప్రగతిని ప్రతిబింబించే అభివృద్ధి సూచిక.

171. నాడు 23 జిల్లాల ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గరిష్ట డిమాండ్ 13,162 మెగావాట్లు మాత్రమే ఉంటే నేడు ఒక్క తెలంగాణాకే 13,468 మెగావాట్లుగా నమోదయ్యింది.

172. తెలంగాణ ప్రభుత్వం శరవేగంగా నిర్మించిన 1,080 మెగావాట్ల భద్రాద్రి పవర్ ప్లాంటు ఉత్పత్తికి సిద్ధమైంది. యాదాద్రి పవర్ ప్లాంట్ నిర్మాణ పనులు చురుకుగా సాగుతున్నాయి.

173. విద్యుత్ రంగానికి ఈ బడ్జెట్ లో 11,046 కోట్ల రూపాయలను ప్రతిపాదిస్తున్నాము.

పారిశ్రామిక రంగం:

174. తెలంగాణ రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతి పరుగులు తీస్తోంది. సింగిల్ విండో పద్ధతిలో పరిశ్రమలకు అనుమతులు ఇస్తూ తీసుకొచ్చిన టీఎస్-ఐపాస్ (TS-iPASS) చట్టం ప్రపంచం దృష్టిని ఆకర్షించింది. సులభతర వాణిజ్య విధానం ద్వారా పరిశ్రమలకి త్వరితగతిన అనుమతులు మంజూరు చేయడంలో మన రాష్ట్రం దేశంలో మూడో స్థానంలో ఉంది.

175. టిఎస్-ఐపాస్ విధానం ద్వారా, గత 6 సంవత్సరాలలో 15,252 పరిశ్రమలకు అనుమతులు ఇవ్వడం జరిగింది, 2.13 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు తరలి రావడంతో 15.51 లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు లభించాయి.

176. ఫార్మా రంగంలో జరిగే జాతీయ ఎగుమతులలో 14 శాతం మన రాష్ట్రం నుంచే ఉన్నాయి. వ్యాక్సిన్లు ఉత్పత్తి చేసే ఫార్మా కంపెనీల్లో 3వ వంతు కంపెనీలు హైదరాబాద్‌లో నెలకొని ఉండటం గమనార్హం. పరిశ్రమల రాయితీల కోసం ఈ ఆర్థిక సంవత్సరంలో 2,500 కోట్ల రూపాయలను ప్రభుత్వం ప్రతిపాదిస్తోంది.

177. పరిశ్రమల శాఖకు 3,077 కోట్ల రూపాయలను ప్రతిపాదిస్తున్నాం.

ఐ టి పరిశ్రమ:

178. ఐటీ ఉత్పత్తులకు కేంద్రంగా తెలంగాణ అంతర్జాతీయ ఖ్యాతినార్జించింది. ప్రపంచ స్థాయి ఐటీ దిగ్గజ సంస్థలు తమ డాటా బేస్ సెంటర్లను హైదరాబాద్‌లో నెలకొల్పాయి.

179. ఐటీ ఎగుమతుల విలువ 2014-15 సంవత్సరంలో 66,276 కోట్ల రూపాయలు కాగా, 2019-20 నాటికి ఆ విలువ రూ.1,28,807 కోట్లకు చేరింది. దీన్ని బట్టి ఐటీ రంగంలో వచ్చిన పురోగతిని అంచనా వేయచ్చు.

180. ఐటీ రంగంలో ఎగుమతుల వృద్ధి రేటు, దేశ సగటు 8.09 శాతం మాత్రమే కాగా, మన రాష్ట్రం వృద్ధి రేటు 17.93 శాతంగా ఉంది.

181. ఎన్నో రకాల ఐటీ కంపెనీలకు హైదరాబాదు హబ్‌గా మారింది. తెలంగాణ ప్రభుత్వం అంకుర సంస్థల ప్రోత్సాహం కోసం ఏర్పాటు చేసిన టీ-హబ్ దేశానికి ఓ రోల్ మోడల్ గా మారింది. మహిళా పారిశ్రామిక వేత్తల కోసం వి-హబ్ విజయవంతంగా పని చేస్తోంది. హైదరాబాద్ అర్బన్ ఏరియాలోని కొంపల్లి, కొల్లాపూర్,

శంషాబాద్, ఉప్పల్, పోచారంలలో ఐటీ పార్కుల విస్తరణకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది. రాష్ట్రంలోని రెండో శ్రేణి నగరాల్లో ఐటీ విస్తరణకు ఖమ్మం, వరంగల్, కరీంనగర్, నిజామాబాద్ జిల్లాల్లో ఐటీ టవర్స్ ను నిర్మించింది. ముఖ్యమంత్రి కేసీఆర్ గారు ఇటీవలే సిద్దిపేటలో ఐటీ టవర్స్ కు శంకుస్థాపన చేశారు.

182. వాహన కాలుష్యం తగ్గించడానికి రాష్ట్రంలో ఎలక్ట్రికల్ వాహనాలని ప్రోత్సహించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇందన పొదుపు కోసం ఈ-వెహికల్ పాలసీని ప్రభుత్వం రూపొందించి ఎలక్ట్రికల్ వాహనాల తయారీకి పెట్టుబడి, రవాణా పన్నుపై సబ్సిడీని కల్పించింది.

183. ఐటీ రంగానికి ఈ బడ్జెట్లో 360 కోట్ల రూపాయలను ప్రతిపాదిస్తున్నది.

రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ కు అండదండలు:

184. ప్రజా రవాణా వ్యవస్థలో ఆర్టీసీ కీలకం. అనేక కారణాల వల్ల ఆర్టీసీ నష్టాలను ఎదుర్కొంటోంది. అయినా ప్రభుత్వం ఆర్టీసీని కాపాడుకుంటూ వస్తోంది. తెలంగాణ ప్రభుత్వం ప్రజలకు అందుబాటులో ఉండే రవాణా సదుపాయం కల్పించాలనే లక్ష్యంతో

ఆర్టీసీని రక్షిస్తోంది. పెట్రోల్, డీజిల్ ధరలు పెరగడం ఆర్టీసీకి మూలిగే నక్కపై తాటిపండు పడ్డట్టయింది. అయినా ప్రభుత్వం వెనక్కు తగ్గకుండా సామాన్యుడికి ప్రజా రవాణాను అందిస్తూ, కార్మికులకు మెరుగైన జీతభత్యాలు ఇస్తూ, ఆర్టీసీని బలోపేతం చేసేందుకు ప్రభుత్వ ధనాన్ని ఖర్చు చేస్తోంది.

185. ఆర్టీసి కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించింది. ఆర్టీసి ఆదాయాన్ని పెంచేందుకు ప్రవేశపెట్టిన కార్గో పార్సిల్ సర్వీసులు విజయవంతమయ్యా . ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఎంప్లాయిస్ బోర్డును ఏర్పాటు చేసి దాని ద్వారా సమస్యలను పరిష్కరిస్తోంది. ఆర్టీసీకి ఈ బడ్జెట్ లో 1,500 కోట్ల రూపాయలను ప్రభుత్వం ప్రతిపాదిస్తోంది. అదేకాక, ఇంకొక 1,500 కోట్ల బడ్జెటేతర నిధులు ఇచ్చి, ఈ ఆర్థిక సంవత్సరానికి మొత్తం 3,000 కోట్ల నిధులను ఆర్టీసి కి సమకూర్చాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ చర్యల ద్వారా ఆర్టీసీ సంస్థ బలోపేతం అవుతుందని ప్రభుత్వం విశ్వాసంతో ఉంది.

**హరితహారం:**

**186. భూభాగంలో 33 శాతం పచ్చదనం ఉన్నప్పుడే వాతావరణ సమతౌల్యం ఏర్పడుతుంది. కాని మానవ తప్పిదాల వల్ల నేడు అడవులు నశించి గ్లోబల్ వార్మింగ్ తో ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నాయి. నగరాలు కాంక్రీట్ జంగిల్ గా మారి స్వచ్ఛమైన గాలి కూడా కరువయిపోతోంది. చెట్ల శాతం తగ్గిపోయి తరచుగా వర్షాభావ పరిస్థితులు నెలకొంటున్నా . ఈ పరిస్థితిని మార్చి హరిత తెలంగాణను నిర్మించేందుకు ప్రభుత్వం తెలంగాణకు హరితహారం అనే కార్యక్రమాన్ని నిరంతరంగా కొనసాగిస్తోంది. భూమిపై పచ్చదనం పెంచేందుకు మొక్కలు నాటుతూ చేస్తోన్న అతిపెద్ద మానవ ప్రయత్నంగా హరితహారం కార్యక్రమం ప్రపంచ ప్రఖ్యాతి పొందింది.**

**187. ప్రభుత్వం అటవీ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని అడవుల పునరుద్ధరణను పెద్ద ఎత్తున చేపట్టింది. 2015 సంవత్సరం నుంచి 9 లక్షల 65 వేల ఎకరాల్లో అడవుల పునరుద్ధరణ జరిగింది. రాబోయే రోజుల్లో ఇంకా 10 లక్షల 50 వేల ఎకరాల అడవుల పునరుద్ధరణను లక్ష్యంగా పెట్టుకున్నది.**

188. హరితహారం ప్రజల భాగస్వామ్యం, ఉద్యమ స్ఫూర్తితో సాగుతోంది. నాలుగు విడతల్లో నిర్వహించిన హరితహారం కార్యక్రమంలో 2015 నుండి ఇప్పటి వరకు 211 కోట్ల మొక్కలను ప్రభుత్వం నాటింది. నగరాల్లో, పట్టణాల్లో అర్బన్ పార్కులను బాగా అభివృద్ధి చేస్తోంది. పల్లె ప్రగతిలో గ్రామ సీమల్లో చెట్లను నాటటం, పెంచడం విరివిగా జరిపిస్తోంది. మొక్కల సంరక్షణకు అధికారులను, ప్రజాప్రతి ధులను బాధ్యులుగా చేసింది. నేడు గ్రామాల్లో, పట్టణాల్లో, అడవుల్లో పెరిగిన పచ్చదనం కనువిందు చేస్తోంది. తెలంగాణ ఏర్పడిన నాటితో పోల్చితే రాష్ట్రంలో పచ్చదనం శాతం 3.67 మేర పెరిగిందని కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన ఫారెస్ట్ సర్వే ఆఫ్ ఇండియా ప్రకటించింది.

189. ఈ సంవత్సరం అటవీ శాఖకు 1,276 కోట్ల రూపాయలను ప్రభుత్వం ప్రతిపాదిస్తుంది.

**దేవాలయాల అభివృద్ధి:**

190. తెలంగాణలో సుప్రసిద్ధ దైవ క్షేత్రాలు ఎన్నో ఉన్నా, సమైక్య రాష్ట్రంలో వాటికి తగిన గుర్తింపు, వైభవం రాలేదు. తెలంగాణ ఏర్పాటయిన తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ గారు ప్రతిష్టాత్మకంగా యాదాద్రి క్షేత్రాన్ని, భూలోక వైకుంఠంగా తీర్చిదిద్దుతున్నారు.

అపూర్వమైన వాస్తు, శిల్ప కళతో ఈ దేవాలయం ఆధ్యాత్మిక ఔన్నత్యానికి ప్రతీకగా దర్శనమిస్తోంది.

191. జంటనగరాల్లో ఉన్న దేవాలయాల్లో కూడా ఈ ఆర్థిక సంవత్సరం నుంచి ధూపదీపనైవేద్య పథకం విస్తరింపజేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది.

192. ఈ ఆర్థిక సంవత్సరంలో మొత్తంగా దేవాలయాల అభివృద్ధి, అర్చకులు, దేవాదాయ ఉద్యోగుల సంక్షేమం కోసం 720 కోట్ల నిధులను ప్రభుత్వం ప్రతిపాదిస్తోంది.

రహదారులు భవనాల నిర్మాణం:

193. ఆర్థికాభివృద్ధిని వేగవంతం చెయ్యడంలో రహదారులు ముఖ్యపాత్ర పోషిస్తాయి. తెలంగాణ ఏర్పడిన తర్వాత రాష్ట్రంలోని రహదారులు ఎంతో అభివృద్ధికి నోచుకున్నాయి.

194. రాష్ట్రంలో ఆర్ అండ్ బి మరియు పంచాయతీ రాజ్ శాఖల కింద రోడ్ల విస్తరణ వేగంగా జరిగింది. గ్రామీణ ప్రాంతాల్లో 5,800 కిలోమీటర్ల రోడ్లను నూతనంగా నిర్మించింది. ఆర్ అండ్ బి శాఖ పరిధిలో ఇప్పటి వరకు కొత్తగా 360 కిలోమీటర్ల నాలుగు లైన్ల రోడ్లు మరియు 7,630 కిలోమీటర్ల డబుల్ లైన్ రోడ్లు నూతనంగా నిర్మాణం

చేసింది. వీటితోపాటు 386 వంతెనల నిర్మాణం చేపట్టింది. రోడ్ల మరమ్మత్తులు మరియు నిర్వహణ కోసం ఈ బడ్జెట్‌లో ప్రత్యేకంగా నిధులని కేటాయించి, వర్షాకాలం రాకముందే గుంతల్ని పూడ్చేయాలని, రోడ్డు కటింగ్‌లు లేకుండా మరమ్మత్తులు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

195. వరదలకు దెబ్బతిన్న రోడ్ల నిర్వహణ, మరమ్మతుల కోసం ఆర్ అండ్ బి రోడ్లకు 800 కోట్లు, పంచాయతీరాజ్ రోడ్లకు 300 కోట్లు నిధులను ప్రతిపాదిస్తున్నది.

196. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాలలో సమీకృత కలెక్టరెట్లు, జిల్లా పోలీసు కార్యాలయాల నిర్మాణం వేగంగా జరుగుతోంది. నగరంలో నెలకొల్పుతున్న పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్ నిర్మాణం అతి త్వరలో పూర్తవుతుంది. ఇందు కోసం ఈ బడ్జెట్ లో 725 కోట్ల నిధులను ప్రభుత్వం ప్రతిపాదిస్తోంది.

197. ప్రభుత్వం నూతంగా నిర్మిస్తున్న సచివాలయ నిర్మాణానికి ఈ ఆర్థిక సంవత్సరంలో 610 కోట్ల రూపాయలను ప్రభుత్వం ప్రతిపాదిస్తోంది.

198. 2014 లో రాష్ట్రం ఏర్పడే నాటికి రాష్ట్రంలో 32 ఆర్వోబీ, ఆర్‌యూబీలు మాత్రమే ఉండేవి. 2019-20 నాటికి మరో 21 ఆర్వోబీ, ఆర్‌యూబీలు పూర్తిచేశాం. కొత్తగా 21 ఆర్వోబీ, ఆర్‌యూబీలకు పరిపాలనాపరమైన అనుమతులు కూడా మంజూరయ్యాయి. వీటి కోసం 400 కోట్ల రూపాయలను ప్రతిపాదిస్తున్నది.

199. ఈ సంవత్సరం రోడ్ల, భవనాల శాఖకు ఈ బడ్జెట్ లో 8,788 కోట్ల రూపాయలను ప్రభుత్వం ప్రతిపాదిస్తోంది.

**తెలంగాణాకు మరో మణిహారం రీజినల్ రింగ్ రోడ్డు:**

200. హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ రద్దీ తగ్గించడంతో పాటు జిల్లాల నుండి హైదరాబాద్ కు మెరుగైన రవాణా సౌకర్యం ఏర్పడడం కోసం ప్రభుత్వం రీజనల్ రింగు రోడ్డును ప్రతిపాదించింది. ప్రస్తుతం ఉన్న అవుటర్ రింగు రోడ్డుకు 30 కిలోమీటర్ల అవతల, 348 కిలోమీటర్ల పొడవున రీజనల్ రింగ్ రోడ్ నిర్మాణం కానుంది. ఈరోడ్డు నిర్మాణం తెలంగాణ అభివృద్ధికి కొత్త ఊపునిస్తుంది.

201. రీజినల్ రింగ్ రోడ్డుకు అవసరమైన భూసేకరణకు రాష్ట్ర ప్రభుత్వం ఈ బడ్జెట్ లో 750 కోట్ల రూపాయలను ప్రతిపాదిస్తోంది.

202. రాష్ట్రంలో పౌర విమానయానాన్ని అభివృద్ధి చేయాలన్న తలంపుతో రాష్ట్రంలోని ద్వితీయ శ్రేణి నగరాల్లో ఎయిర్‌స్ట్రిప్‌ల నిర్మాణాన్ని ప్రభుత్వం తలపెట్టింది. ఇందు కోసం ప్రభుత్వం ఈ బడ్జెట్‌లో 100 కోట్ల నిధులను ప్రతిపాదిస్తోంది.

**శాంతి భద్రతలు -పోలీస్ సంక్షేమం:**

203. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడగానే పోలీస్ వ్యవస్థను ఆధునీకరించడంతో పాటు, ఫ్రెండ్లీ పోలీస్ విధానం అమలు అయ్యే విధంగా చర్యలు చేపట్టింది. పోలీసు శాఖకు బడ్జెట్ లో భారీగా నిధులు అందించి నూతన వాహనాలను, సాంకేతిక సాధనాలను సమకూర్చింది. సిబ్బంది సంఖ్యను అవసరాలకు తగినంతగా పెంచింది. గుడుంబా, పేకాట, గ్యాంబ్లింగ్‌ల నిషేధాన్ని పోలీసులు పటిష్టంగా అమలు చేస్తున్నారు. కరోనా కాలంలో పోలీసు శాఖ స్ఫూర్తిదాయకమైన సేవలను అందించింది. అందుకు వారికి అదనంగా ఒక నెల వేతనాన్ని ప్రభుత్వం అందించింది. బహిరంగ ప్రదేశాల పర్యవేక్షణ కోసం నగర వ్యాప్తంగా 6 లక్షల 65 వేలకు పైగా సీసీ టీవీ కెమెరాలను ఏర్పాటు చేసింది. దేశంలో ఉన్న మొత్తం సీసీ కెమెరాల్లో 65 శాతం తెలంగాణాలోనే ఉన్నాయి.

204.   2021-22 బడ్జెట్ లో హోంశాఖకి 6,465 కోట్ల రూపాయలను ప్రభుత్వం ప్రతిపాదిస్తోంది.

**పౌరసరఫరాల శాఖ- ఆహార భద్రత:**

205.   అందరికీ ఆహార భద్రత కల్పించడం కోసం తెలంగాణ పౌర సరఫరాల శాఖ మెరుగైన సేవలందిస్తోంది. ప్రతీ వ్యక్తికి ఆరు కిలోల చొప్పున కుటుంబంలో ఎంత మంది ఉంటే అంతమందికి పరిమితి విధించకుండా రూపాయికి కిలో బియ్యాన్ని అందిస్తోంది. రేషన్ కార్డు ఉంటే చాలు రాష్ట్రంలో ఎక్కడైనా సరుకులు తీసుకునే విధంగా ప్రభుత్వం సంస్కరణను తెచ్చింది. రాష్ట్రంలో నేడు 2 కోట్ల 79 లక్షల 65 వేల 218 మంది రూపాయికి కిలో చొప్పున నెలకు ఆరు కిలోల రేషన్ బియ్యం పొందుతున్నారు.

206.   ఈ బడ్జెట్ లో ప్రభుత్వం పౌరసరఫరాల శాఖకు 2,363 కోట్ల రూపాయలను ప్రతిపాదిస్తోంది.

**పర్యాటక - సాంస్కృతిక రంగం:**

207. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు జాతీయ అంతర్జాతీయ స్థాయిలో నూతన గుర్తింపును, ప్రచారాన్ని తెలంగాణ ప్రభుత్వం కల్పిస్తోంది. రాష్ట్రం ఏర్పాటయిన నాటినుండి బతుకమ్మ, బోనాలు, రంజాన్, క్రిస్టమస్ పండుగలను ప్రభుత్వ ఆద్వర్యంలో రాష్ట్ర పండుగలుగా నిర్వహిస్తోంది. వృద్ధ కళాకారులకు పెన్షన్లు అందిస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా అనేక పర్యాటక ప్రాంతాల్లో సదుపాయల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. గత సంవత్సరం కరోనా మూలంగా బడ్జెట్‌లో ప్రతిపాదించిన కొన్ని పనులను పూర్తిచేయలేకపోయాం. ఈ ఆర్థిక సంవత్సరంలో కాళేశ్వరం టూరిజం సర్క్యూట్ పనులను ప్రారంభించడానికి నిర్ణయించాం.

208. ఈ ఏడాది బడ్జెట్ లో సాంస్కృతిక పర్యాటకరంగాలకు 726 కోట్ల రూపాయలను ప్రభుత్వం ప్రతిపాదిస్తోంది.

209. కరోనా కష్ట కాలంలో కూడా, రాష్ట్ర ఆదాయం తగ్గకుండా ఉండడానికి కృషి చేసిన వాణిజ్య పన్నుల, ఎక్సైజ్, స్టాంపులు మరియు రిజిస్ట్రేషన్లు, రవాణా, గనుల శాఖల మంత్రులను మరియు అధికారులను అభినందిస్తున్నాను.

**2021-22 బడ్జెట్ అంచనాలు:**

**210. 2021-22 ఆర్థిక సంవత్సరంలో రూ.2,30,825.96 కోట్ల వ్యయాన్ని ప్రతిపాదిస్తున్నాను. దీనిలో రెవెన్యూ వ్యయం రూ.1,69,383.44 కోట్లు, మరియు క్యాపిటల్ వ్యయం రూ.29,046.77 కోట్లు. బడ్జెట్ అంచనాలలో రెవెన్యూ మిగులు రూ.6,743.50 కోట్ల రూపాయలు కాగా, ఆర్థిక లోటు రూ.45,509.60 కోట్ల రూపాయలు ఉంటుందని అంచనా.**

**ముగింపు:**

**211. ధ్యేయమును బట్టి ప్రతి పనీ దివ్యమగును అని అన్నారు మహా కవి దాశరథి. మా ధ్యేయం సకల జనుల సంక్షేమం, మా లక్ష్యం ప్రజల బతుకులు పండించే బంగారు తెలంగాణం. సకల జనుల భాగస్వామ్యంతో తెలంగాణ ఉద్యమాన్ని ముఖ్యమంత్రి గారు ముందుకు నడిపించారు. నేడు అదే విధంగా అన్నివర్గాల ప్రజలను విశ్వాసంలోకి తీసుకుంటూ ప్రగతి రథాన్ని పరుగులు పెట్టిస్తున్నారు. విభిన్న సంస్కృతులకు నిలయమైన తెలంగాణ వారసత్వాన్ని నిలబెట్టుకుంటూ మనం ఐక్యంగా పురోగమిద్దాం. తలపెట్టిన అభివృద్ధి యజ్ఞాన్ని పట్టుదలతో కొనసాగిద్దాం. సమాజంలో అట్టడుగున ఉన్న**

ఆఖరి వ్యక్తి దాకా ప్రగతి ఫలాలను అందిద్దాం. ప్రజలే చరిత్ర నిర్మాతలన్న విశ్వాసంతో ముమ్ముందుకు పురోగమిద్దాం. ప్రజలు కేంద్రంగా తెలంగాణ ప్రస్థానం కొనసాగుతుంది. గౌరవ ముఖ్యమంత్రి కేసీఆర్ గారి నాయకత్వంలో తెలంగాణను మరింత ఉజ్వలంగా తీర్చిదిద్దుకోగలమనే బలమైన విశ్వాసాన్ని ప్రకటిస్తూ... 2021-22 సంవత్సరానికి గాను రూపొందించిన బడ్జెట్ ప్రతిపాదనలను సభ ఆమోదం కోసం ప్రవేశపెడుతున్నాను.

జై హింద్......జై తెలంగాణా...